

జడ్పీ సమావేశంలో హైడ్రామా

ప్రజలు, రైతుల సమస్యలపై పోరాడాల్సిన జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఆ విషయాన్ని పక్కనపెట్టి ఆందోళనకు దిగారు. తమకు, జడ్పీ చైర్‌పర్సన్‌కు సీఈవో విలువ ఇవ్వట్లేదని, జడ్పీ నిధులతో చేపట్టే 424 పనులను అకారణంగా నిలుపుదల చేశారని, ఈ పనులు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ నానా యాగీ చేశారు. వైసీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు జడ్పీ సమావేశంలో పోడియం ఎదుట బైఠాయించడంతో 4 గంటల పాటు హైడ్రామా నడిచింది.

4 గంటల పాటు వైసీపీ జడ్పీటీసీలు, ఎంపీపీల రచ్చరచ్చ

- సీఈవోపై విరుచుకుపడిన చైర్‌పర్సన్, సభ్యులు
- కలెక్టర్ ఎంత వారించినా వినకుండా నినాదాలు
- వీడెవడు.. వాడెవడంటూ సీఈవోపై వ్యాఖ్యలు
- నిలిపివేసిన పనులకు అనుమతులివ్వాలని పట్టు
- తమాషాగా ఉందా.. అంటూ ఎమ్మెల్సీ మొండితోక మండిపాటు
- జరిగిన పనులకు బిల్లులిస్తామనడంతో గప్‌చుప్..!

జడ్పీ పనులు ఎలా రద్దు చేస్తారని యాగీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన శనివారం మచిలీపట్నంలోని జడ్పీ కన్వెన్షన్ హాల్లో జడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రతిపాదించిన అంశాలపై చర్చ జరగకుండానే సమావేశం ఆద్యంతం హైడ్రామా మధ్య నడిచింది. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులంతా ఖాళీగా కూర్చుండిపోయారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పెద్దల అండతో, ఎంపీలు, ఎమ్మెల్యేల సూచనతో జడ్పీ అధికారులు పరిపాలన సాగిస్తున్నారన్నారు. జడ్పీ నిధులు 24.37 కోట్ల అంచనాతో చేపట్టనున్న 424 పనులను నిధుల కొరత, పనులు ఇంకా ప్రారంభించలేదనే కారణంతో నిలిపివేస్తూ జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారని మండిపడ్డారు. చైర్‌పర్సన్‌గా ఉన్న తనకు, సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండానే పాలన సాగుతోందన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు మిగతా 6లో..



సమావేశంలో పోడియం ఎదుట బైఠాయించిన జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు

అధికారులపై ఎమ్మెల్సీ ఫైర్

జిల్లా పరిషత్ నిధులను ఎమ్మెల్యేలు, ఎంపీలు సూచించిన పనులకు కేటాయించి, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు సూచించిన పనులను నిలిపివేయటం ఎంతవరకు సబబని ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ అన్నారు. జడ్పీ నిధులతో చేపట్టే పనులను జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు సూచించిన విధంగా కాకుండా, వాటిని నిలుపుదల చేయటంతో పాటు ఇంతసేపు వారు పోడియం ఎదుట బైఠాయించినా తగిన విధంగా స్పందించకపోవటం సమంజసం కాదని, అధికారులు తమాషాలు చేసున్నారని కలెక్టర్, జడ్పీ సీఈవోలను ఉద్దేశించి ఆగ్రహంగా అన్నారు. కలెక్టర్ కల్పించుకుని భావోద్వేగంగా మాట్లాడవద్దని హితవు పలికారు.



దిత్వా భయం

నేడు, రేపు కోస్తాతీరం వెంబడి భారీ వర్షాలు

- నేటి ఉదయం తీరం దాటనున్న తుఫాను
- రెడ్ అలర్ట్ జారీచేసిన వాతావరణ శాఖ

మచిలీపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపాను అన్నదాతలను పరుగులు పెట్టిస్తోంది. ఆదివారం ఉదయం సమయంలో తీరం దాటనున్న నేపథ్యంలో కోస్తాతీరం వెంబడి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ శనివారం హెచ్చరించింది. తుపాను తీరం దాటే సమయంలో దక్షిణ కోస్తా ప్రాంతంలో అతి భారీవర్షం కురుస్తుందని రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. డిసెంబరు 1న కూడా తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. సముద్రం అల్లకల్లోలంగా ఉన్న నేపథ్యంలో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లొద్దని పేర్కొంది. వరికోతలు జరుగుతున్న సమయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. జిల్లాలో శనివారం రాత్రి నుంచే వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని గాలులు వీచాయి. ఆకాశం మేఘావృతమైంది.

రైతుల్లో ఆందోళన

వరికోతలు కోసిన రైతులు ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో ఉన్నారు. ఇప్పటికే కోతలు కోసిన ధాన్యాన్ని రహదారుల పైకి చేర్చి పట్టాలతో కప్పి ఉంచుతున్నారు. మరికొందరు రైతులు ధాన్యం విక్రయించేందుకు మిల్లర్లు, వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారు. తుఫాను కారణంగా వర్షం కురిస్తే ధాన్యం తడిచిపోతుందనే భయం రైతులను వెంటాడుతోంది.

5 రోజులు.. 7 లక్షలు

- భవానీ దీక్షల విరమణకు వచ్చే భక్తులపై అధికారుల అంచనా 6

డివైడర్‌ను ఢీకొన్న బైక్

ఇద్దరు దుర్మరణం

డివైడర్‌పై పడి ఉన్న మృతదేహాలు • మృతిపై పలు అనుమానాలు



నరసింహులు, దానియేలు మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు



దానియేలు (ఫైల్)



నరసింహులు (ఫైల్)

కంకిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నెప్పల్లి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉయ్యూరు టౌన్‌కు చెందిన పచ్చిగళ్ల దానియేలు రాడ్ బెండింగ్ చేస్తూ జీవిస్తున్నాడు. కంకిపాడు మండలం మిగతా 6లో..

రోడ్డు ప్రమాదమేనా?

ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన పోలీసులు డివైడర్‌ను ఢీకొని పడి పోయి ఉంటారని అంచనాకు వచ్చారు. మృతదేహాలు డివైడర్ మధ్యలో ఒక పక్కన పెట్టినట్లు ఉన్నాయని, ఎవరైనా రోడ్డు ప్రమాదం చేసి, పక్కకు తరలించి ఉంటారా? అని విలేకరులు ప్రశ్నించగా మృతదేహాలను రోడ్డుపై చూసిన వారెవరైనా డివైడర్ మధ్యలో పెట్టి వెళ్లి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

నున్నలో రూ.100 కోట్ల విలువ చేసే ట్రాన్స్‌కో స్థలానికి ఏ దిక్కూ లేకుండాపోయింది. మూడున్నర దశాబ్దాల కిందట ట్రాన్స్‌కో (అప్పట్లో ఏపీఎస్ఈబీ) కొన్న 27 ఎకరాలకు ఇప్పటికీ చేతి రశీదు తప్ప మరో ఆధారం లేకపోవడం అధికారుల అలసత్వానికి నిదర్శనంగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం.. పీజీసీఎల్‌ను ప్రైవేట్‌కు అప్పగిస్తే ఆ భూమి పరిస్థితి ఏమిటి? అనే సందిగ్ధం నెలకొంది.

నున్నలో అప్పట్లో ఏపీఎస్ఈబీ కొన్న 25 ఎకరాల భూమి (పసుపు రంగు)



ఆ భూమి ఎవరిది?

ట్రాన్స్‌కోకు చెందిన రూ.100 కోట్ల ఆస్తిహక్కుపై సందిగ్ధం

- 35 ఏళ్ల కిందట కొన్న భూమి.. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ లేదు
- నాడు కేవలం చేతి రశీదుతో 25 ఎకరాలు కొన్న ట్రాన్స్‌కో
- నాడు దాని విలువ రూ.17 లక్షలు.. నేడు రూ.వంద కోట్లు
- ఇప్పటికైనా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలనే డిమాండ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) 1989, జూలై 15న అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నున్నలో సర్వే నెంబర్లు 589, 590, 591, 592, 593, 594, 672, 673, 674, 675లోని పలు సబ్ డివిజన్ల పరిధిలో 127.86 ఎకరాలను రూ.79.15 లక్షలకు కొనింది. అలాగే, 1990లో ఏపీఎస్ఈబీ (ట్రాన్స్‌కో) రూ.17 లక్షలకు ఎన్‌టీపీసీ భూముల్లో 27 ఎకరాలు కొనింది. అప్పట్లో ఎన్‌టీపీసీకి ఏపీఎస్ఈబీ (ట్రాన్స్‌కో) డబ్బు ఇచ్చి భూములను స్వాధీనం చేసుకుంది. ఆ భూముల్లో 27 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసింది. కొన్న భూములకు సంబంధించి అప్పట్లో కేవలం రశీదును మాత్రమే పొందింది. ఎన్‌టీపీసీ నుంచి మిగతా 6లో..

మెగా విస్తరణ!

- ఎన్టీఆర్, కృష్ణా వారధిగా విస్తరణాభివృద్ధి
- నిడమానూరు-పోరంకి కాంక్రీట్ జంగిల్‌గా విస్తరణ 8



సైకిల్‌పై కలెక్టరేట్‌కు వచ్చి, చెత్తను తొలగిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

వాయుకాలుష్యం నివారణ అందరి బాధ్యత

● వారానికి ఒక్కసారైనా సైకిల్ వాడాలి : కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వాయు కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ వారానికి ఒక్కసారైనా సైకిల్ వినియోగించాలని కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ నేతృత్వంలో కలెక్టరేట్‌లోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది స్వచ్ఛ త కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అక్టోబరు నెలలో వాయు కాలుష్యం ప్రధాన అంశంగా స్వచ్ఛాం ధ్ర కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. వాయు నాణ్యత పెంచాలంటే ఎక్కువ మంది సైకిల్‌ను వాడాలన్నారు. కలెక్టరేట్ పరిసరాల్లో ప్రతి శనివారం ఉద్యోగులందరూ చెత్తాచెదారాలను తొలగించి శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. కలెక్టరేట్‌లో సుందరీకరణ పనులు చేపడతామన్నారు. డీఎస్‌వో మోహన్‌బాబు, బీసీ సంక్షేమ అధికారి రమేష్, భూ సర్వే రికార్డుల ఏడీ జోషిలా, బీసీ కార్పొరేషన్ ఈడీ రాజేంద్ర, సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా పర్యాటక అధికారి రామ్‌లక్ష్మణ్, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, సహాయ కమిషనర్ గోపాలరావు, కలెక్టరేట్ ఏవో రాధిక, కలెక్టరేట్‌లోని వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

హంసలదీవి బీచ్ గేట్లు మూసివేత



కోడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుపాను నేపథ్యంలో హంసలదీవి బీచ్ గేట్లు రెండు రోజులపాటు మూసివేస్తున్నట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీసాయి శనివారం తెలిపారు. పాలకాయితిప్ప సముద్రపు కరకట్ట వద్ద బీచ్ గేట్లను 30, 01 తేదీల్లో మూసివేస్తున్నామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఈ విషయాన్ని గమనించి హంసలదీవి బీచ్ వద్దకు రావొద్దని తెలిపారు.

5 రోజులు..7 లక్షల మంది!

● భవానీ దీక్షల విరమణ 11 నుంచి ● ఆర్జిత సేవలు రద్దు ● 15వ తేదీన మహా పూర్ణాహుతితో ముగింపు

ఇంద్రకీలాద్రి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో డిసెంబరు 11 నుంచి 15వ తేదీ వరకు ఐదు రోజులపాటు జరిగే భవానీ దీక్షల విరమణకు ఏడు లక్షల మంది భవానీలు వస్తారని అంచనా అని, వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఈవో వి.కె. శీనా నాయక్ అన్నారు. ఆలయ ఉద్యోగులతో శనివారం భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లపై సమీక్షా

భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూ లైన్లు, విశ్రాంతి హోళ్లు, పార్కింగ్ స్థలాలు, ప్రసాదం, అన్నదానం పంపిణీ కౌంటర్లు



సమీక్షా సమావేశంలో అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఈవో వి.కె.శీనానాయక్

సమావేశం నిర్వహించారు.

భవానీ దీక్షల విరమణకు అనుసరించాల్సిన విధివిధానాలు, భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు అవగాహన కల్పించారు. అధికారులు సమన్వయంతో పని చేసి, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. భవానీ దీక్షల విరమణ డిసెంబరు 11వ తేదీ ఉదయం 8 గంగలకు ప్రారంభమై 15వ తేదీ ఉదయం 10.30 గంటలకు మహాపూర్ణాహుతితో ముగుస్తాయన్నారు. ఈ సందర్భంగా అగ్నిప్రతిష్టాపన, శత చండీయాగం, గిరి ప్రదక్షిణలు వంటి ప్రధాన అంశాలుంటాయన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూ లైన్లు, విశ్రాంతి హోళ్లు, పార్కింగ్ స్థలాలు, ప్రసాదం, అన్నదానం పంపిణీ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన భద్రత చేయాలన్నారు. భవానీ దీక్షల విరమణ నేపథ్యంలో డిసెంబరు 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అన్ని ఆర్జిత సేవలను తాత్కాలికంగా రద్దు చేసి, ఏకాంతంగా నిర్వహిస్తారు. భవానీ మండల దీక్షలు నవంబరు 1 నుంచి 5 వరకు, అర్ధ మండల దీక్షలు నవంబర 21 నుంచి 25 వరకు జరిగాయన్నారు. డిసెంబర్ 4వ తేదీన కలశజ్యోతి మహోత్సవం నిర్వహిస్తామన్నారు. భవానీ దీక్షల విరమణలో భాగం గా మూడు హోమగుండాలు ఏర్పాటు చేస్తారు. గత సంవత్సరం 18 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేయగా, ఈసారి సుమారు 30 లక్షల ప్రసాదాలు తయారు చేయాలని అంచనా వేశారు. బస్సుస్టేషన్, రైల్వే స్టేషన్లతో కలిపి మొత్తం 19 ప్రసాదం విక్రయ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. కేశఖండనశాలలో ఈ సేవలకు 950 మంది క్షురకులు (బార్బర్లు) అందుబాటులో ఉంటారు. ఈసారి దోబీ ఘాట్ వద్ద అదనంగా కేశఖండనశాల ఏర్పాటు చేస్తున్నామన్నారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురుభవానీలను ప్రత్యేకంగా నమో దు చేస్తారు. విధుల్లో ఉండే సిబ్బందికి, ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చే సిబ్బందికి ప్రత్యేకంగా ఐడీ కార్డులు జారీ చేస్తామన్నారు. తొమ్మిది కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు మార్గదర్శనం కోసం బోర్డులు ఏర్పాటు చేస్తారు. అన్నదానం మెనూ బోర్డును ప్రదర్శిస్తారు. ఇంజనీరింగ్ విభాగం చేపట్టాల్సిన అన్ని పనులు పండుగకు ఒక వారం ముందుగానే పూర్తి చేస్తారు. చేసిన పనులన్నింటినీ ఒక మ్యాప్‌లో ప్రదర్శిస్తారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మూడు వేల మందికి పైగా పోలీసులు, 300లకు పైగా సీసీటీవీ కెమెరాలతో పటిష్టమైన భద్రత ఏర్పా టు చేస్తారు. భక్తుల సౌకర్యార్థం దర్శనం, ప్రసాదం కౌంటర్లు, గిరి ప్రదక్షిణ మార్గం వివరాలతో కూడిన భవానీ దీక్ష - 2025 మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు.

ఈ సమావేశంలో కార్యనిర్వాహక ఇం జనీర్లు 1, 2, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ కమిషనర్-1, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు ఆరుగురు, సూపరింటెండెంటు-13 మంది, గుమస్తాలు, ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బాలకోటయ్య

ప్రజా రాజధాని అభివృద్ధి కోసమే రెండో విడత భూసమీకరణ

అమరావతిపై మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు లేదు : బాలకోటయ్య

గాంధీనగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతిని మరింతగా అభివృద్ధి చేసేందుకే రెండో విడత భూసమీకరణను ప్రభుత్వం చేపడుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య స్పష్టం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం మొదటి విడత మాదిరిగానే రాజధాని ప్రాంతంలోని ఏడు గ్రామాల పరిధిలో రైతులను ఒప్పించి 16,666 ఎకరాల భూసమీకరణ చేస్తుందన్నారు. అమరావతిలో ఏదో జరిగిపోతుందని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. అమరావతిపై మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు లేదన్నారు. రాజధానిలో రైతు సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దీనికోసమే కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో త్రి సభ్య కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. తొలివిడత, రెండో విడతలో భూములిచ్చిన రైతులకు నష్టం జరగదన్నారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు గంధం సంపత్‌కుమార్, అమరావతి రైతు నాయకుడు కుమ్మరి కోటేశ్వరరావు, బహుజన జేఏసీ నేతలు మామిడి సత్యం, వజ్రాల రవిశంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్, హాజరైన వివిధ కళాశాలల ఉపాధి శిక్షణాధికారులు

సీఎం చంద్రబాబు చొరవతో కంపెనీల వెల్లువ

పట్టుభద్రులు ఉద్యోగాల పొందేలా తీర్చిదిద్దాల్సింది ఉపాధి కల్పనాధికారులే : మంత్రి సుభాష్

మొగల్రాజపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో ఏపీలో భారీగా పెట్టుబడులతో కంపెనీలు వస్తున్న తరుణంలో పట్టభద్రులను ఉద్యోగులుగా తీర్చిదిద్దడంలో ఉపాధి కల్పనాధికారుల పాత్ర ఎంతో కీలకమని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఏపీ శిక్షణ, ఉపాధి అధికారుల సమాఖ్య, పీబీ సిద్ధార్థ కళాశాల సంయుక్తంగా శనివారం ప్లేస్‌మెంటార్- 2025 నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సుభాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఐదు లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించనుందన్నారు. దానిలో ఉపాధి అధికారుల పాత్ర చాలా ముఖ్యమైనదని చెప్పారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు డిసెంబరు 12, 13, 14 తేదీల్లో ఎస్ఎస్ కన్వెన్షన్‌లో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించే బిజినెస్ ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఏపీ అన్నే ఇంద్రజిత్, ఇన్ఫోసిస్ విశాఖపట్నం సెంటర్ హెడ్ నర్రా సురే ష్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ విజయవాడ ఏఐ క్లబ్ అధ్యక్షుడు బొర్రా సురేష్ బాబు ప్రాంగణఎంపికల్లో విజయం సాధించడానికి అనుసరించడాల్సిన వ్యూహాలను మార్గనిర్దేశనం చేశారు. పీబీ సిద్ధార్థ కళాశాల డీన్ ఆచార్య రాజేష్ జంపాల, ఏపీ శిక్షణాధికారుల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ ఎన్.వి.సురేంద్రబాబు, కార్యదర్శి జగదీష్, సంయుక్త కార్యదర్శులు కావూరి శ్రీధర్ హిమబిందు, సభ్యులు శివ నాగేశ్వరరావు, 80 కళాశాలల ఉపాధి అధికారులు పాల్గొన్నారు.

టైలర్ ప్రాణం తీసిన పోలీసుల అత్యుత్సాహం?

● పేట పోలీసులపై ఆరోపణలు ● తనయుడు ఇప్పించిన అప్పునకు తండ్రి వద్దకు పోలీసులు ● ప్రాణాలు కోల్పోయిన తండ్రి

విజయవాడ/నందిగామ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : సివిల్ వివాదంలో జగ్గయ్యపేట పోలీసులు అత్యుత్సాహం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. ఓ రాజకీయ నాయకుడు చేసిన సిఫార్సుతో ఫిర్యాదు అందగానే పోలీసులు ఆగమేఘాల మీద స్పందించారు. ఫోన్ చేసి స్టేషన్‌కు విచారణ రమ్మనే అవకాశాన్ని పక్కన పెట్టేశారు. నేరుగా పరిధి దాటి వెళ్లి పోలీసు ఇజం చూపించారు. ఇదిప్పుడు కమిషనరేట్‌లో చర్చనీయాంశంగా మారింది.

నందిగామలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద గల అపార్టుమెంట్ ఐదో అంతస్తులో వెంకటరావు (53) టైలరింగ్ చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆయన కుమారుడు రాజేష్ హైదరాబాద్‌లో సినీపరిశ్రమలో ఉన్నా డు. వెంకటరావు కుమార్తె విజయవాడ మొగల్రాజపురంలో ఉంటోంది. జగ్గయ్యపేటకు చెందిన పుండరీకాక్షుడు అనే వ్యక్తి వద్ద వెంకటరమణ కుమారుడు రాజేష్ రూ.1.50 లక్షలు అప్పును తనకు పరిచయం ఉన్న వ్యక్తికి ఇప్పించాడు. ఇటీవల అప్పు ఇచ్చిన పుండరీకాక్షుడు మృతి చెందాడు. అతని కుమారుడు జస్వంత్ పలుమార్లు అప్పుగా తీసుకున్న సొమ్ము తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆయన జగ్గయ్యపేట పోలీసులను ఆశ్రయిం చాడు. సాధారణంగా ఇటువంటి కేసుల్లో పోలీసులు ఫిర్యాదు తీసుకోగానే అవతలి వ్యక్తులకు ఫోన్ చేసి, విచారణ రావాలని స్టేషన్‌కు పిలిపిస్తారు. ఈ కేసులో మాత్రం జగ్గయ్యపేట పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. శనివారం ఉదయం జగ్గయ్యపేట నుంచి పోలీసులు నందిగామలో ఉంటున్న వెంకటరావు ఇంటికి వెళ్లారు. ఆయన నుంచి ఫోన్‌ను లాక్కునే క్రమంలో పెనుగలాట జరిగిందని, ఆయన కాలు జారి పైనుంచి కింద పడిపోయాడని భార్య ఆరోపిస్తోంది. తర్వాత పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారని చెబుతోంది.

నందిగామ పోలీసుల వివరణ

దున్నా వెంకటరమణ మరణించిన ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని నందిగామ పోలీసు లు చెబుతున్నారు. మృతుడి భార్య చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం ఏమిటన్నది దర్యాప్తులో తేలుతుందన్నారు



అపార్ట్‌మెంటుపై నుంచి పడి తీవ్రంగా గాయపడిన వెంకటరావు

ఐదో అంతస్తు నుంచి వెంకటరావు పడిపోవడంతో ఆయన రెండు కాళ్లు పూర్తిగా విరిగిపోయాయి. అంతర్గత అవయవాలకు తీవ్రమైన గాయాలయ్యాయి. ఆయనను వెంటనే అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాసుపత్రి తరలించారు. అత్యవసర విభాగంలో కొద్దిసేపు చికిత్స పొందిన వెంకటరావు మధ్యాహ్నం ప్రాణాలు కోల్పోయాడు. వెంకటరావు ఇంటికి రైటర్ భానుప్రసాద్ వెళ్లినట్టు సమాచారం. అయితే, జగ్గయ్యపేటలో ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే పోలీసులు నందిగామ వెళ్లారని, వెంకటరావు పడిపోగానే హడావిడిగా వచ్చి ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జడ్పీ సమావేశంలో హైడ్రామా

(5వ పేజీ తరువాయి)

సూచించిన పనులకు జడ్పీ నిధులు రూ.8 కోట్లకు పైగా కేటాయించి, మరో పది నెలల్లో పదవీకాలం పూర్తికానున్న జడ్పీటీసీ సభ్యులు సూచించిన 424 పనులను నిలిపివేశారని ఆమె మండిపడ్డారు.

నాలుగు గంటల పాటు బైఠాయింపు

జడ్పీ ఛైర్‌పర్సన్, సీఈవో పనులు రద్దు చేసిన విషయాన్ని సమావేశంలో ప్రస్తావిస్తుండగానే, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పోడియం ఎదుటకు వచ్చి ఆందోళనకు దిగారు. సీఈవోను సస్పెండ్ చేయాలని, ఆయన నిరం కుశ వైఖరి నశించాలని, ఛైర్‌పర్సన్‌కు క్షమాపణ చెప్పాలని నినదించారు. అన్ని పనులు చేసేందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. సాయంత్రం 4.12 గంటల వరకు ఈ ఆందోళన సాగింది.

కలెక్టర్‌పై విమర్శలు

జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలకు కలెక్టర్ బాలాజీ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నిధుల కొరత కారణంగానే పనులను నిలుపుదల చేస్తున్నట్టుగా చూపారని, ఈ ఏడాది జడ్పీకి రూ.8 కోట్లలోపే వివిధ రూపాల్లో నిధులు సమకూరాయని, నిధులు అందుబాటులో లేకుండా పనులు చేయిస్తే, కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో ఇవ్వడానికి ఇబ్బందులు ఎదురవుతాయ న్నారు. కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయిస్తే సీఈవోనే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. దీనికి సభ్యులు మాట్లాడుతూ ఎంపీలు, ఎమ్మెల్యేలు సూచించిన పనులను రద్దు చేయాలని, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు సూచించిన పనులకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో ఛైర్‌పర్సన్ మరోమారు కలగజేసుకుని జడ్పీ సీఈవోకు, పంచాయతీరాజ్ విభాగం అధికారులకు మద్దతుగా కలెక్టర్ మాట్లాడుతున్నారని, ప్రజలతో నేరుగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు కలెక్టర్ విలువ ఇవ్వట్లేదని చెప్పడంతో సభ్యులు మరింత బిగ్గరగా నినాదాలు చేశారు. జడ్పీ సీఈవో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే తీర్మానం చేసి తనకు పంపాలని, ఆ తీర్మానాన్ని ఉన్నతాధికారులకు పంపుతానని కలెక్టర్ తెలిపారు. తనకు 15 రోజులు సమయం ఇస్తే విజిలెన్స్ అధికారులతో మాట్లాడి ప్రాధాన్యతాక్రమంలో బిల్లులు చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. అయినా సభ్యులు వినలేదు.

జడ్పీ సీఈవోపై పరుష పదజాలం

సభ్యుల్లో ఒకరిద్దరు.. జడ్పీ నిధులతో చేపట్టిన పనులను నిలిపివే యడానికి జడ్పీ సీఈవోకు ఏం అధికారాలు ఉన్నాయని, పనులు రద్దు చేయ టానికి వీడెవడు, వాడెవడు అంటూ పరుష పదజాలాన్ని ఉపయోగించారు. దీంతో జడ్పీ సీఈవో కన్నమనాయుడు మాట్లాడుతూ సభా మర్యాదను ప్రతి ఒక్కరూ పాటించాలని, తనపట్ల పరుష పదజాలం ఉపయోగించటం భావ్యం కాదని, జడ్పీలో నిధులు అందుబాటులో లేని కారణంగానే పను లను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామని, ఈ అంశంపై ఏమైనా అభ్యంతరాలుంటే నేరుగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవచ్చని, తాను తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి పొరపాటు లేదన్నారు.

పనులు జరిగితే సరిదిద్ది అనుమతులు ఇస్తాం

జడ్పీ నిధులు రూ.24.37 కోట్లతో గతంలో అనుమతిచ్చిన పనులు కొనసాగుతాయని, ఇంజనీరింగ్ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం జరిగిన పనులకు బిల్లులు మంజూరు చే స్తామని జడ్పీ సీఈవో తెలిపారు. దీంతో సభ్యులు పోడియం ఎదుట నుంచి వెళ్లిపోయారు. అనంతరం జరిగిన చర్చలో ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ జడ్పీ సీఈవో మాటపై తమకు నమ్మకం లేదని, కలెక్టర్ ఈ అంశంపై పూర్తిస్థాయి బాధ్యత వహించాలని కోరారు. పనులకు అనుమతులు ఇస్తున్నట్లు జారీచేసిన ఉత్తర్వులను సభ్యులకు చూపాలన్నారు. దీనికి జడ్పీ సీఈవో స్పందిస్తూ.. జడ్పీ నిధులతో చేపట్టిన పనులు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీచేశామని, పనులు జరిగితే వాటికి బిల్లులు మంజూరు చేస్తామని జారీచేసిన ఉత్తర్వులను చదివి వినిపించారు. ఈ సమావేశంలో నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న, ఎన్టీఆర్ జిల్లా జేసీ ఇలక్కియా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కృష్ణాతరంగ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కృష్ణా వర్సిటీ వీసీ కూన రాంజీ

కృష్ణాతరంగ్ 4, 5, 6 తేదీల్లో : వీసీ రాంజీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా విశ్వవిద్యాలయంలో డిసెంబరు 4, 5, 6 తేదీల్లో కృష్ణాతరంగ్ నిర్వహించనున్నట్టు కేయు వీసీ కూన రాంజీ తెలిపారు. శనివారం వీసీ తన చాంబర్‌లో కృష్ణాతరంగ్ పోస్టర్లను ఆవిష్కరించారు. వీసీ రాంజీ మాట్లాడుతూ, కృష్ణాత రంగ్‌లో పాల్గొనే విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలు తమ పోటీల వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కృష్ణాతరంగ్ కన్వీనర్ దిలీప్, నవీన లావణ్యలత, సుశీల, సుజాత, అనిల్, మత్తే నాగరాజు పాల్గొన్నారు.



గ్రామస్థులతో కలసి మాట్లాడుతున్న జెట్టి కుసుమ కుమార్

ఫిబ్రవరి 8న శ్రీపెరుంబదూర్‌లో కమ్మ మహానాడు

ఘంటసాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కమ్మ గ్లోబల్ ఫెడరేషన్(కేజీఎఫ్) ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురం జిల్లా శ్రీ పెరుంబుదూర్‌లో ఫిబ్రవరి 8, 2026న కమ్మ మహానాడు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి కుసుమ కుమార్ తెలిపారు. ఘంటసాల మండలం కొడాలి గ్రామంలో చెందిన తుమ్మల రంగారావు ఇంటి వద్ద సోమవారం కేజీఎఫ్ పరిచయ సమావేశం జరిగింది. జెట్టి కుసుమ కుమార్ మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో కంటే తమిళనాడు రాష్ట్రంలో 65 లక్షల మంది కమ్మ సమాజం ఉందన్నారు. వారందరినీ ఒకతాటిపైకి తెచ్చేందుకు, సుమారు పది లక్షల మందిని సమీకరించి కమ్మ మహానాడు నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల్లో సుమారు 30 సీట్లు సాధించాలన్నది దృఢ సంకల్పమన్నారు. గొప్ప కోసం కమ్మ సభలను, మహానాడులను నిర్వహించడం లేదన్నారు. చేస్తున్న సేవలను తెలుసుకునేందుకు, తమ వారికి చేదోడు వాదోడుగా ఉండేందుకు నిర్వహిస్తున్నామన్నారు. దేశ జనాభాలో రెండు కోట్ల పది లక్షల మంది కమ్మ జనాభా ఉన్నారని, వారి ఐక్యతే ప్రధాన ఏజెండా అన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, ఉన్నతులుగా నిలపాలన్నది లక్ష్యం అన్నారు. తమ ఆత్మీయులను కలుసుకోవటం చాలా ఆనందంగా ఉందన్నారుర. ఆ సంఘ ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత శిక్షణ గడువు పొడిగింపు

కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, స్టడీ సర్కిల్ విజయవాడ వారి ఆదేశాల మేరకు సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులను స్వీకరించుటకు గడువును పొడిగిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.లక్ష్మీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తులను డిసెంబరు 3వ తేదీ లోగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం మరియు సాధికారత అధికారి, ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ కార్యాలయంలో సమర్పించాలన్నారు. డిసెంబరు 7వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి శిక్షణకు ఎంపిక చయడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థినీ విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఇతర వివరాలకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి, ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ, ఏపీ బీసీ స్టడీ సర్కిల్, అశోక్‌నగర్, డోర్ నెం.74-2-1/5, పండరీపురం, రోడ్డు నెం.8, విజయవాడ, ఫోన్ నెంబర్లు 9966849937, 9505094349, 8688855255లో సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్

(5వ పేజీ తరువాయి)

కోలవెన్ను శివారు కోమటిగుంట లాకుకు చెందిన సందోలు నరసింహులు తాపీపని చేస్తుంటాడు. వీరిద్దరూ శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఉయ్యూరు వైపు నుంచి కంకిపాడు వస్తున్నారు. నెప్పల్లి సమీపంలో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి పడి పోయారు. ఉదయం 8 గంటలకు వరకు వీరిని ఎవరూ పట్టించుకోలేదు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి దూరంగా మోటార్ సైకిల్ లేకపోవడం, ప్రమాద ఆనవాళ్లు కూడా కనిపించకపోవడంతో ఎవరికీ తెలియలేదు. అయితే, అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి అనుమానం వచ్చి చూడగా, ఇద్దరి ముక్కులో రక్తం కనిపించింది. సమాచారం అందుకున్న కంకిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.మురళీకృష్ణ, ఎస్సై తాతాచార్యులు హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఆ భూమి ఎవరిది?

(5వ పేజీ తరువాయి)

ఆ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకునే విషయంలో అప్పట్లో ఏపీఎస్ఈబీ (ట్రాన్స్‌కో) అధికారులు అలసత్వం చూపారు. నాటి నుంచి ఇప్పటి వరకు ట్రాన్స్‌కోకు డాక్యుమెంట్ల పరంగా బదలాయింపు జరగలేదు.

ఎన్టీపీసీ నుంచి పీజీసీఐఎల్‌కు బదలాయింపు

కేంద్ర ప్రభుత్వం ఎన్టీపీసీ స్థానంలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్)ను తీసుకొచ్చింది. 1992లో ఎన్టీపీసీ కొన్న 127.86 ఎకరాలను పీజీసీఐఎల్‌కు బదలాయించింది. ఈ భూముల్లో 27 ఎకరాలు ఏపీఎస్ఈబీ (ట్రాన్స్‌కో) కొన్నప్పటికీ ఆ భూములను ఎన్టీపీసీ మాత్రం పీజీసీఐఎల్‌కు బదలాయింపు చేసింది. కనీసం అప్పుడైనా ఏపీఎస్ఈబీ (ట్రాన్స్‌కో) అధికారులు తాము కొన్న భూములను బదలాయించమని అడగలేదు. ఇలా 1990 నుంచి 2025 వరకు 35 ఏళ్లపాటు ట్రాన్స్‌కోకు ఆ భూములు అధికారికంగా దాఖలు కాలేదు. ఇప్పటికీ ఎఫ్ఎంబీ, అడంగల్, పాస్‌బుక్, 1బీ వంటివి లేవు.

నాడు కొన్నది రూ.17 లక్షలు... నేడు రిజిస్ట్రేషన్‌కు రూ.4 కోట్లు

నున్నలోని ఈ 27 ఎకరాల ప్రస్తుత మార్కెట్ విలువ రూ.100 కోట్లు. ఆ రోజుల్లో ఏపీఎస్ఈబీ (ట్రాన్స్‌కో) రూ.17 లక్షలతో ఈ 27 ఎకరాలు కొన్నది. అప్పుడే రిజిస్ట్రేషన్ చేసుకుని ఉంటే రూ.లక్షలోపే ఖర్చయ్యేది. అప్పట్లో జరిగిన నిర్లక్ష్యం కారణంగా ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే సుమారు రూ.4 కోట్లకు పైగా ఖర్చు అవుతుంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 640

యార్లగడ్డ చొరవతో ఇండ్లాస్ శాంతివనం వరకు బస్సు సౌకర్యం



విజయవాడ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నున్నవికాస్ కాలేజీ రోడ్డులోని ఇండ్లాస్ శాంతివనం వరకు ఏపీఎస్ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించింది. 48ఐ పేరుతో శనివారం నూతన సర్వీస్‌ను ప్రారంభించారు. నున్న గ్రామ టీడీపీ నేతలు, ఆర్టీసీ సిబ్బంది సర్వీస్‌ను జెండా ఊపి ప్రారంభించారు. గత నెల ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఇండ్లాస్ శాంతి వనం ను సందర్శించిన సందర్భంగా శాంతివనం చైర్మన్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల దృష్టికి తీసుకెళ్లగా ఆయన చొరవతో అధికారులు నూతన సర్వీస్‌ను ఏర్పాటు చేశారు.



పిరమిడ్ విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

విద్యతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచాలి

ప్రసాదంపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడల పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంచాలని అంతర్జాతీయ చెస్ గ్రాండ్ మాస్టర్ ముట్నూర్ రోహిత్ లలిత్ బాబు అన్నారు. శనివారం నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం ఆటల విషయంలో చాలా నిబద్ధతతో ఉందని కొనియాడారు. అనంతరం విద్యారులు క్రీడా పోటీలు, మాస్ డ్రిల్, కరాటే, పిరమిడ్ విన్యాసాలు, తల్లిదండ్రులకు లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కడియాల ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపాల్ ఎం.ఎస్ భవనేశ్వరన్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



క్రికెట్ టీమ్‌తో ఎంఈవో కమల

ఉపాధ్యాయుల క్రీడలు ప్రారంభం

గన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఉపాధ్యాయుల క్రీడలు శనివారం ఉత్సాహంగా ప్రారంభ మయ్యాయి. పురుషులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలను ఎంఈవో-2 కమల ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్రీడాస్ఫూర్తితో రాణించాలన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు క్రీడలలో పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడల సమన్వయకర్త ధనియాల నాగరాజు, హెచ్‌ఎం ఎ.సుశీల, జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి జి.రాంబాబు, పీడీలు మీరా సాహేబ్, బాలకృష్ణ, గీత, టాన్యగిరి, శ్రీదేవి, శాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకట రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ చింతలపేట రామ్‌నగర్, సొసైటీ పేట, పాతగన్నవరం, కొత్తపేట, ఇస్లాంపేట, శేషసాయి గార్డెన్, బీబీగూడెం, గొల్లనపల్లి, స్లేట్ స్కూల్ ఏరియా, వీరపనేనిగూడెం, తెంపల్లి, బల్లిపర్రు, మర్లపాలెం హౌసింగ్ కాలనీ, మెట్లపల్లి, కొత్తగూడెం, చింతగుంట, కండ్రిక, చిక్కవరం, ఉషా స్పిన్నింగ్ మిల్ ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు సరఫరాను నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వరి కోత యంత్రాలు అందుబాటులో ఉంచాలి

కంకిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మరో తుఫాను ముంచుకొస్తున్న తరుణంలో ప్రభుత్వం అప్రమత్తమై రైతులకు వరి కోత యంత్రాలను అందుబాటులో ఉంచాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని జగన్నాధపురం, గొడవర్రు, ఉప్పలూరు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. కోత కోసి రోడ్డుపై ఆరబోసిన ధాన్యాన్ని, కోత్తకు సిద్ధంగా ఉన్న వరిపైరును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు పంచకర్ల రంగారావు, టి. నరేష్, వి. జాన్ మోజెస్, ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్త మధు వంశీ మాతృమూర్తి మృతి



రాజ్యలక్ష్మి (ఫైల్)

ఉయ్యూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గండిగుంటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి చాపరాల మధువంశీ తల్లి చాపరాల రాజ్యలక్ష్మి(74) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. రాజ్యలక్ష్మికి ముగ్గురు కుమారులు కాగా మధువంశీ స్థానికంగా వ్యాపారం చేస్తుండగా, మరో ఇద్దరు కుమారులు ఆస్ట్రేలియాలో ఉంటు న్నారు. రాజ్యలక్ష్మి మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, వైసీపీ నాయకుడు చక్రవర్తి, పలువురు ప్రముఖులు శనివారం ఆమె భౌతికకాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. రాజ్యలక్ష్మి అంత్యక్రియలు ఆదివారం నిర్వహిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్వోసీ పంపిణీ



పెనమలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న పోరంకి గ్రామానికి చెందిన కాడి భార్గవ్‌కు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం 1.40లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్వోసీ చెక్కును పంపిణీ చేశారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



హనుమాన్‌జంక్షన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని విశ్వ హిందు పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్ బాపులపాడు జడ్పీహైస్కూల్ విద్యార్థులకు సూచించారు. శనివారం హైస్కూల్‌లో 80 మంది టెన్త్ విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను పుట్టగుంట బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకర సుభాష్ చంద్రబోస్, శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్, జనసేన నేత చలమలశెట్టి రమేష్‌బాబు, పీఈటీ అక్కినేని రాఘవేంద్రరావు, రేవిణిశెట్టి జితేంద్ర, హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

100 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

గన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని విజయవాడ జూబ్లీ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ వి.మహేందర్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రజ్ఞ స్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. వంద మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 9 మందికి దృష్టి లోపం ఉన్నట్లు నిర్ధారించారు.

రైతులకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, దేవినేని రాజా తదితరులు

కంకిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతన్నలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఈడుపుగల్లులో శనివారం నిర్వహించిన రైతన్న నీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రైతులు పండిస్తున్న పంటలపై అడిగి తెలుసుకున్నారు. తమలపాకు, బొప్పాయి, వరి, మొక్కజొన్న రైతులతో మాట్లాడారు. వివరాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుం దన్నారు. ముమ్మరంగా సాగుతున్న వరి కోతలను దృష్టిలో పెట్టుకొని రైతులకు అవసరమైన గోనె సంచులు, ట్రాన్స్‌పోర్టు సౌకర్యం సకాలంలో అందిస్తుందన్నారు. నియోజక వర్గంలో రైతులను అటు అధికారులు, ఇటు మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తుంటే తక్షణం తన దృష్టికి తీసుకురావాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ఏవో ఉషారాణి, విజయ్, టీడీపీ మండల అధ్యక్షులు జంపని వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఇందిర, డీసీ రత్నభూషణ్, కంకిపాడు పీఏసీఎస్ అధ్యక్షులు సుంకర శివ, సీహెచ్‌సీ డైరెక్టర్ రవి కిషోర్, దేవినేని అనీల్ కుమార్, షకార్, అనుమోలు రామ కృష్ణ, పందిపాటి సుధాకర్, రైతులు పర్వతనేని శివకోటేశ్వరరావు, వీరపనేని వెంకటే శ్వర రావు, నందమూరి మాధవ, పర్వతనేని శ్రీనివాస, సంగెపు రంగారావు, మాబు సుబాని, వీరమాచినేని ప్రవీణ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



దివ్యాంగుడికి విద్యుత్ ట్రైసైకిల్ ఇస్తామని హామీ ఇస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని అధికారులతో కలిసి పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. కాకులపాడులో శుక్రవారం రాత్రి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమస్యలు విన్న వించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో రావడంతో రాత్రి 10 గంటల వరకూ వారు చెప్పే సమస్యలను సావధానంగా వినడంతో పాటు కొన్ని సమస్యలను అక్కడిక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఆరుగొలనుకు చెందిన దివ్యాంగుడు తన సమస్యను తెలిపేందుకు వేచి ఉండటం గమనించి పోలీసులతో తన దగ్గరకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం అందజేసే విద్యుత్ ట్రైసైకిల్ వల్ల తన కుటుంబావసరాలకు ఉపయోగపడుతుందని కోరగా అధికారులతో మాట్లాడి దివ్యాంగుని అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజాదర్బార్‌లో అత్యధిక శాతం నూతన పెన్షన్లు, ఇంటి స్థలాలకు సంబంధించిన సమస్యలతో పాటు భూసర్వే సమస్యలు కూడా ఎక్కువగా రావడంతో అధికారులు సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. కొందరు గ్రామ స్థాయి అధికారులపై ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేయడంతో ఆయా అధికారులపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు చేరువగా వెళ్లి సమస్యలను పరిష్కరించేలా కార్యాచరణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, దయాల రాజేశ్వరరావు, ఆళ్ల గోపాలకృష్ణ, మూల్పూరి సాయికళ్యాణి, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదివే వాతావరణం కల్పించాలి

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



బాలోత్సవ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

ఉయ్యూరు, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): జీవితానికి చదువు చాలా ముఖ్యమ యినప్పటికి పిల్లలు బట్టీపట్టే విధానం కాకుండా ఇష్టపడి చదివే వాతావ రణం విద్యసంస్థల్లో నెలకొల్పాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. శ్రీశ్రీనివాస విద్యాసంస్థల ఆవరణలో శనివారం నిర్వహించిన బాలోత్సవ్ 2025లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల అభివృద్ధికి తగ్గట్టుగా సృజనాత్మకం, జ్ఞానతృష్ణను ప్రోత్సహించే వ్యవస్థ ప్రస్తుతం ఎంతో అవసరమన్నారు. పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వరరావు మాట్లాడుతూ సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్ టీవీల ద్వారా పిల్లలు మరోలోకం వైపు వెళుతు న్నారని వాటిని నియంత్రించే దిశలో తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. బాలో త్సవ్ కమిటీ అధ్యక్షుడు పరుచూరి శ్రీనివాసరావు, కార్యదర్శి కాగిత గోపాలకృష్ణ, విశ్వమోహన్, మనోహర్, కె.శివ నాగేంద్రం, కుటుంబరాజు, సీఐ రామారావు, కార్యదర్శి, నూకల సాంబశివరావు పాల్గొన్నారు.

పరిశోధనా నాణ్యతను పెంచడంలో వర్క్‌షాప్‌లు కీలకం

కానూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పరిశోధనా నాణ్యతను పెంచడంలో వర్క్‌షాప్‌లు కీలకపాత్ర పోషిస్తాయని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ పి. వెంకటేశ్వరరావు అన్నారు. కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో ఇంగ్లిష్ విభాగం, ఆర్ అండ్ డీ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో స్ట్రాటజిక్ అప్రోచస్ ఫర్ హైక్వాలిటీ పబ్లికేషన్ అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ శనివారం జరిగింది. చెన్నై విట్ ఇంగ్లిష్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజశేఖరణ్ ప్రసంగిస్తూ మంచి జర్నల్స్ ఎంపిక, స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్ వంటి ఇండెక్సింగ్ ప్రమాణాల ప్రాధాన్యతను వివరిం చారు. కార్యక్రమంలో ప్రో. వీసీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం. రవిచంద్, వర్సిటీ ఇంగ్లిష్ విభా గం అసిస్టెంట్ హెడ్ డాక్టర్ నీలాంబరం, డీన్ డాక్టర్ పీవీఆర్‌ఎల్ నరసింహం పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని బయటకు తీయాలి

కంకిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని బయటకు తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు, విద్యా కమిటీలు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నప్పటికీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీఈవో కె. పద్మారాణి, ఎంఈవో ఎం. శ్రీనివాసరావు, హెచ్‌ఎం పద్మావతి బాయి తదితరులు పాల్గొన్నారు.

బ్లూ గ్రీన్ సినర్జీతో వాతావరణ సమతుల్యత

ఉయ్యూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నీటి వనరులు, పచ్చటి జీవన వ్యవస్థ, సినర్జీ కలసి వాతావరణ సమతుల్యతను ఏర్పరుస్తాయని రాజీవ్‌గాంధీ సెంటర్ ఫర్ ఆక్వాకల్చర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అనుప్ మండేలా అన్నారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల స్వర్ణోత్సవం పురస్కరించుకుని కళాశాల జంతు, వృక్షశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రస్థాయి లివింగ్ వరల్డ్ ఎక్స్‌పో 2025 నిర్వహిం చారు. ఆర్‌జీసీఏ సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో వాతావరణ మార్పులతో పర్యావరణ వ్యవస్థల మధ్య సమన్వయం అత్యంత ముఖ్యమైనదన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శన తిలకించగా సీనియర్ అధ్యపకులు వి.సుభాషిణి వ్యాఖ్యాన కర్తగా వ్యవహిరించారు. కళాశాల కన్వీనర్ తాతినేని శ్రీహరిరావు, ఎల్. కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, వినియ్‌కుమార్ తది తరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించాలి

గన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధితో ఆర్థిక స్వావ లంబన సాధించాలని పీఆర్‌కె ఫౌండేషన్ అధినేత పారా రామకృష్ణ అన్నారు. మండ లంలోని బుద్ధవరం శివారు రాజీవ్‌నగర్ కాలనీలో గండికోట జయలక్ష్మీకి బడ్డీకొట్టును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, కూటమి ప్రభు త్వం పేదరికాన్ని నిర్మూలించేందుకు విశేష కృషి చేస్తుందన్నారు. దానిలో భాగంగానే పీ-4 విధానాన్ని తీసుకువచ్చిందని తెలిపారు.



రమణగోపాల్ దంపతులను సత్కరిస్తున్న చలసాని ఆంజనేయులు

సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమాజంలోఉపాధ్యాయులది కీలక పాత్రని, ఉపాధ్యాయులది వృత్తి కాదని సామాజిక బాధ్యతని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వీరవల్లి హైస్కూల్ ఉపాధ్యా యుడు రమణగోపాల్ పదవీ విరమణ సందర్భంగా హెచ్‌ఎం నిర్మల అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. రమణగోపాల్ దంపతులను ఘనంగా సత్కరించారు. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, ఏపీఆర్డీసీ డైరెక్టర్ గరికపాటి శివ శంకర్, స్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, తదితరులు రమణగోపాల్, విజయలక్ష్మి దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో దారపురెడ్డి భాస్కరరావు, లలితా కామేశ్వరి పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులకు అండగా బ్రాహ్మణ పరిషత్



ఆర్థికసాయం అందజేస్తున్న కె.వి.ఆర్.కిషోర్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పేద బ్రాహ్మణ కుటుంబాలకు అన్ని విధాల అండగా బ్రాహ్మణ పరిషత్ ఉంటుందని అధ్యక్షుడు కె.వి.ఆర్. కిషోర్ అన్నారు. వీరవల్లిలో ఇటీవల మరణించిన చావలి పుణ్యవర్ధన్ శర్మ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పుణ్యవర్ధన్‌శర్మ గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడంతో కుటుంబం పెద్దదిక్కును కోల్పోవడంతో బ్రాహ్మణ పరిషత్‌కు చెందిన సభ్యులు తమ వంతు సాయంగా రూ.61వేలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శనగవరపు గోపాలకృష్ణ, శలాక రవి కుమార్, గౌరవ సలహాదారు శనగవరపు వెంకటేశ్వరశర్మ, రామకృష్ణ, గాయత్రి మందిర ట్రస్టు సంయుక్త కార్యదర్శి శ్రీకాంత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పట్ల మానవత్వాన్ని చాటాలి



ఆశాజ్యోతి దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న యార్లగడ్డ సతీష్

హనుమాన్‌జంక్షన్ : మానవత్వంతో దివ్యాంగుల పట్ల ప్రేమను చూపించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు యార్లగడ్డ సతీష్ అన్నారు. టీడీపీ తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి తన జన్మదిన వేడుకను శనివారం ఆశాజ్యోతి దివ్యాంగుల ఆశ్రమంలో జరుపుకున్నారు. దివ్యాంగులు మధ్య కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు, శరణాల మాలతీరాణి, దొంతు చిన్నా, చిరుమామిళ్ల సూర్యం, చలమలశెట్టి రమేష్‌బాబు, ఆళ్ళ గోపాలకృష్ణ తదితరులు సాయికల్యాణికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

గన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని సూరంపల్లి పాలడుగు పార్వతీదేవి ఇంజనీరింగ్ కళాశాలలో కృష్ణ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల డీడీయూ-జీకేవై శిక్షణార్థులకు ఉపాధి అవకాశాలను అందించేందుకు రాష్ట్ర సీడ్ ఏపీ, కంచర్ల ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వం యువత ఉపాధి విస్తరణకు ప్రాముఖ్యతనిస్తుందన్నారు. సీఎం చంద్రబాబు కట్టుదిట్టమైన ప్రణాళికల వల్ల రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి వేగంగా ముందుకు సాగుతున్నాయన్నారు. ఈ మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్‌పై చూపిస్తున్న నిబద్ధతకు స్పష్టమైన నిదర్శనమన్నారు. 10 ప్రముఖ కంపెనీలు రాగా మూడు జిల్లాల నుంచి 300 మందికి పైగా అభ్యర్థులు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. ఎంపికైన వారికి కంపెనీ నియమక పత్రాలు అందజేశారు. ప్రాజెక్టు డైరెక్టర్ హరిహరనాథ్, జేడీఎం సుమలత పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీ ఎల్ఎల్‌బీ పరీక్షా ఫలితాల వెల్లడి

మచిలీపట్నం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయం ఎల్ఎల్‌బీ 2,6వ సెమిస్టర్ ఫలితాలను శనివారం పరీక్షల అధికారి డాక్టర్ సీ వీరబ్రహ్మాచారి వెల్లడించారు. ఎల్ఎల్‌బీ 2వ సెమిస్టర్‌లో 261 మంది హాజరు కాగా, 77.78 శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా బీఏతో కూడిన ఎల్ఎల్‌బీ 6వ సెమిస్టర్‌లో 88 మంది హాజరు కాగా 94.12 శాతం ఉత్తీర్ణులయ్యారు. బీఏఎల్ఎల్‌బీ 2వ సెమిస్టర్‌లో 131 మంది హాజరు కాగా, 87.79 శాతం ఉత్తీర్ణులయ్యారు.



విద్యార్థి షేక్ కాజా మొహిద్దీన్‌ను అభినందిస్తున్న సిద్దార్థ వర్సిటీ చాన్సలర్ కేవీ చౌదరి, వీసీ తదితరులు

భారత వర్సిటీల క్రికెట్ జట్టుకు సిద్ధార్థ విద్యార్థి ఎంపిక

● డిసెంబరు 7 నుంచి ఆస్ట్రేలియాతో జరిగే భారత్ జట్టులో స్థానం
● షేక్ కాజా మొహిద్దీన్‌కు వర్సిటీ చాన్సలర్ అభినందన

కానూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీలో ఎంబీఏ ఫస్టియర్ చదివే విద్యార్థి షేక్ కాజా మొహిద్దీన్ భారత విశ్వవిద్యాలయాల క్రికెట్ జట్టు (పురుషుల)కు ఎంపికయ్యారు. డిసెంబరు 7 నుంచి 19 వరకు ఆస్ట్రేలియాలో జరిగే ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్‌కు భారత వర్సిటీల క్రికెట్ జట్టు నుంచి ఆయన ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సిరీస్‌లో భారత వర్సిటీల క్రికెట్ జట్టు, ఆస్ట్రేలియా వర్సిటీల క్రికెట్ జట్లు తలపడనున్నాయి. భారత్ తరుపున షేక్ కాజా మొహిద్దీన్ ఆడుతున్నారు. గతంలో ఆయన వినూమాంకడ్ ట్రోఫీలో అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించారు. అనంతరం ఆలిండియా ఇంటర్ వర్సిటీ క్రికెట్ సెలక్షన్ ట్రయల్స్‌లో అర్హత సాధించి చివరకు భారత వర్సిటీల క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు.

సిద్ధార్థ యాజమాన్యం అభినందనలు

భారత జట్టుకు ఎంపికైన వర్సిటీ విద్యార్థి షేక్ కాజా మొహిద్దీన్‌ను శనివారం సిద్ధార్థ వర్సిటీ యాజమాన్యం అభినందించింది. వర్సిటీ చాన్సలర్ కేవీ చౌదరి, వైస్‌చాన్సలర్ పీ వెంకటేశ్వరరావు, ప్రో. వీసీ ఏవీ రత్నప్రసాద్‌తోపాటు సిద్ధార్థ అకాడమీ నేతలు అభినందించారు. సిద్ధార్థ వర్సిటీకి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన విద్యార్థి షేక్ కాజా మొహిద్దీన్‌ను సత్కరించి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

పెళ్లిని తలపించిన అంతిమయాత్ర

● తల్లిని ఘనంగా సాగనంపిన కుమారుడు



ఉయ్యూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి కని, పెంచి పెద్ద చేసిన మాతృమూర్తి అనారోగ్యంతో మృతిచెందగా అంతిమ యాత్ర పెళ్లివేడుకలా అత్యంత ఆర్భాటంగా నిర్వహించి ఆమెపై ఉన్న ప్రేమను చాటుకున్నాడో కుమారుడు. ఉయ్యూరుకు చెందిన బొల్లా నాని తల్లి బొల్లా సముద్ర వేణి(70) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందగా శనివారం ఆమె భౌతిక ఖాయానికి రూ.లక్షలు వెచ్చించి అత్యంత వైభవంగా అంతిమ యాత్ర చేసి అంత్యక్రియలు నిర్వహించారు. పూలదండలతో హంస అలంకార పల్లకిలో మేళతాళాలతో లక్ష్మీ టాకీస్ సెంటర్ సమీపంలో నాని ఫామ్‌హౌస్ నుంచి మధ్యాహ్నం బయలుదేరిన అంతిమయాత్రలో కాటూరురోడ్డులో శ్మశానవాటిక వరకు పూలవర్షం కురిపిస్తూ సాగింది. అంతిమయాత్రలో పెద్దసంఖ్యలో నాని మిత్రులు, బంధువులు, శ్రేయోభిలాషులు పెద్దయెత్తున పాల్గొన్నారు.



దుర్గమ్మ సన్నిధికి వచ్చిన జెట్టి కుసుమకుమార్

దుర్గమ్మ సన్నిధిలో కేజీఎఫ్ చైర్మన్

ఇంద్రకీలాద్రి నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలోని కనక దుర్గమ్మను శనివారం ఏఐసీసీ సెక్రటరీ, ఒడిశా ఇన్‌చార్జి, కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కేజీఎఫ్) చైర్మన్ జెట్టి కుసుమ కుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జెట్టి కుసుమ కుమార్‌కు ఆలయ కమిటీ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు ఆయనకు అమ్మవారి ఆశీస్సులు అందజేయగా, చైర్మన్ ఆయనకు అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రము, లడ్డు ప్రసాదం అందజేశారు. కేజీఎఫ్ చైర్మన్ జెట్టి కుసుమ కుమార్ వెంట పలువురు కాంగ్రెస్ నేతలున్నారు.

7న మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

● డీఈవో యూవీ సుబ్బారావు

విజయవాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరి ట్ స్కాలర్‌షిప్ పరీక్ష డిసెంబరు 7న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని ప్రభుత్వ పరీక్షల సంచాలకులు ప్రకటించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.in, పాఠశాల లాగిన్‌లోను, whatsa-pp-mana mitra లోను అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. వాట్సాప్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే విధానం కార్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాల UDISE విధానం కోడ్‌ను ఉపయోగించి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు ఇవ్వాలన్నారు.

మెగా విస్తరణ!

● ఎన్టీఆర్, కృష్ణా వారధిగా విస్తరణాభివృద్ధి ● నిడమానూరు - పోరంకి కాంక్రీట్ జంగిల్‌గా విస్తరణ
● కలిసిపోతున్న బందరురోడ్డు (పోరంకి) - నిడమానూరు ● ఎడ్యుకేషన్, హెల్త్ హబ్‌గా మారుతున్న ప్రాంతం

గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదిత జాబితాలోని ప్రాంతాలవి. కృష్ణాజిల్లాలో ఉన్నప్పటికీ భౌగోళికంగా విజయవాడకు దగ్గరగా ఉన్న ప్రాంతాలివి. జనసాంద్రతతో, కిక్కిరిసిన విజయవాడ విస్తరణకు అవకాశం లేకపోవటంతో సమీప రూరల్ ప్రాంత గ్రామాలు విజయవాడతో సమానంగా అభివృద్ధి చెందుతూ విస్తరిస్తున్నాయి. నిడమానూరు, పోరంకి ప్రస్తుతం కలిసిపోయేలా విస్తరణాభివృద్ధి జరుగుతోంది. గ్రేటర్ విలీన ప్రతిపాదిత జాబితాలోని నిడమానూరు, పోరంకి ప్రాంతాల విస్తరణాభివృద్ధిపై ఆంధ్రజ్యోతి కథనం.
- విజయవాడ, ఆంధ్రజ్యోతి



విజయవాడ సిటీకి ఆనుకుని ఉన్న ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. చెప్పాలంటే సిటీ కన్నా ప్రశాంతం, ఆహ్లాదంగా ఉంటాయి. బందరురోడ్డు నుంచి నిడమానూరు జాతీయ రహదారి వరకు 4 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ ప్రాంతం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. ఒకప్పుడు పచ్చని పొలాలున్న ఈ ప్రాంతంలో ఇప్పుడు పెద్దపెద్ద, భవంతులు, అపార్ట్‌మెంట్ల నిర్మాణం జరుగుతున్నాయి. ఉద్యోగస్తులు, వ్యాపారులు ఇక్కడ నివాసముంటున్నారు. దీంతో ఈప్రాంతం గేటెడ్ కమ్యూనిటీలా తయారైంది. ఈ ప్రాంతంలో భూముల ధరలు నాలుగైదేళ్ల కిందట కంటే రెట్టింపు అయ్యాయి. విజయవాడ-గన్నవరం రహదారి రద్దీగా ఉన్నప్పుడు 100, 50 అడుగుల రోడ్లలోనే వాహనాలు పరుగులు పెడతాయి.

జిల్లాల పునర్విభజన సమయంలో రెండు జిల్లాల మధ్య ఉండిపోవడంతో అభివృద్ధి నిలిచిపోతోందేమోనని బందరు రోడ్డు (పోరంకి)- నిడమానూరు మధ్య ప్రాంత ప్రజలు భయపడ్డారు. పోరంకి, నిడమానూరు ప్రాంతంలో సగభాగం ఎన్టీఆర్ జిల్లాలో ఉంటే మరో సగం కృష్ణా జిల్లాలో ఉంది. ఈ రెండు నియోజకవర్గాలు, రెండు జిల్లాలను కలపడంతో పాటు రెండింటికి వారధిగా ఉండడంతో అభివృద్ధిలో దూసుకుపోతోంది. విద్యాసంస్థలు, ఆసుపత్రుల నిర్మాణాలతో ఉద్యోగులు, వ్యాపారస్థులు ఇక్కడ నివసించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. పైగా నగరానికి కూతవేటు దూరంలో ఉన్నప్పటికీ ప్రశాంతంగా ఉంటుంది. దీంతో సంపన్నులు, ఉద్యోగులు స్థలాలు, ప్లాట్ల ధరలు ఎక్కువున్నా వెనుకడుగు వేయటం లేదు.

గ్రేటర్ సాకారమైతే మరింత అభివృద్ధి



బందరు రోడ్డు నుంచి నిడమానూరు వరకు రహదారిని ఆనుకుని 4 కిలోమీటర్లలో ఈ ప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో బందరు రోడ్డు నుంచి 2కిలోమీటర్ల వరకు తాడిగడప మున్సిపాలిటీలో ఉండి పెనమలూరు నియోజకవర్గానికి చెందుతుంది. సుమారు రెండున్నర కిలోమీటర్ల ప్రాంతం గన్నవరం నియోజకవర్గం పరిధిలో ఉంది. ఈ ప్రాంతం మొత్తాన్ని గ్రేటర్ విజయవాడ పరిధిలోకి తీసుకువస్తే వేగంగా అభివృద్ధి చెందుతుందని స్థానికులు చెబుతున్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి ఊపందుకుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో కలిపితే రానున్న రోజుల్లో గ్రేటర్‌లోకి వెళ్లే అవకాశం.. మరిన్ని సౌకర్యాలు పొందవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగేళ్లలోనే ఎంతో అభివృద్ధి

ఆర్ ఉమాకాంత్, స్థానికుడు, అపార్ట్‌మెంట్ అభివృద్ధి కమిటీ మెంబర్



నాలుగేళ్లలో ఈ ప్రాంతం చాలా అభివృద్ధి చెందింది. చిన్న చిన్న సమస్యలున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు చొరవ చూపిస్తే కొన్ని రోజుల్లోనే పరిష్కారమవుతాయి. నాలుగేళ్ల కిందట గజం రూ.40 వేలున్న భూమి ధర ఇప్పుడు సుమారు రూ.65 వేల పైనే ఉంది. గత ప్రభుత్వం కనీసం రోడ్డు కూడా వేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాజధానిగా అమరావతిని ప్రకటించాక అభివృద్ధి ఊపందుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన 3 నెలల్లోనే రోడ్డు వేసింది. పోరంకి- నిడమానూరు 50 అడుగుల రోడ్డును 80 అడుగుల రోడ్డుగా వేస్తారని ప్రతిపాదనలున్నట్టు తెలిసింది. ఇదే నిజమైతే ఈ ప్రాంతం రెండు జిల్లాలకు వారధిగా ఉండడంతో పాటు ఇక్కడే అనేక సంస్థలు వచ్చే అవకాశం ఉంది. తగిన స్థలం అందుబాటులోనే ఉంది.

సికింద్రాబాద్ - అనకాపల్లి మధ్య

ప్రత్యేక రైలు సర్వీసులు

రైల్వేస్టేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు 8 ట్రిప్పుల చొప్పున ప్రత్యేక రైలు సర్వీసులు సికింద్రాబాద్ - అనకాపల్లి మధ్య నడుపుతున్నట్టు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రూపకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 07041 సికింద్రాబాద్ - అనకాపల్లి ఆదివారాలలో నడుస్తుంది. డిసెంబరు 7, 14, 21, 28 తేదీల్లో 4 ట్రిప్పులు, 07042 అనకాపల్లి - సికింద్రాబాద్ సోమవారాల్లో బయలుదేరుతుంది. డిసెంబరు 8, 15, 22, 29 తేదీలలో 4 ట్రిప్పులు నడుస్తుంది. చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి స్టేషన్లలో ఆగుతుంది. వన్ ఏసీ, టూ ఏసీ, త్రీ ఏసీ, స్లీపర్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి.

సత్రాగచ్చి - ఎల్హంక మధ్య..

ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు 4 ట్రిప్పుల చొప్పున ప్రత్యేక రైలు సర్వీసులు సత్రాగచ్చి - ఎల్హంక మధ్య నడుపుతున్నట్టు సౌతే సెంట్రల్ రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 02863 సత్రాగచ్చి - ఎల్హంక గురువారాలలో నడుస్తుంది. డిసెంబరు 4, 11, 18, 25 తేదీల్లో 4 ట్రిప్పులు, 02864 ఎల్హంక - సత్రాగచ్చి శనివారాల్లో బయలుదేరుతుంది. డిసెంబరు 6, 13, 20, 27 తేదీలలో 4 ట్రిప్పులు నడుస్తుంది. ప్రస్తుతం ఉన్న సమయాలు, స్టాపేజీల్లో ఎలాంటి మార్పులేదని సౌత్ సెంట్రల్ రైల్వే సీపీఆర్‌వో ఒక ప్రకటనలో తెలిపారు.

దేవాలయాలను అభివృద్ధి చేయాలి

● మంత్రి కొల్లు రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, బీజేపీ నాయకుడు సోడిశెట్టి బాలాజీ తదితరులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సనాతన హైందవ ధర్మ పరిరక్షణకు దేవాలయాలు కీలకపాత్ర వహిస్తున్నాయని, వాటి పరిరక్షణకు నూతనంగా ఎన్నికైన ధర్మకర్తల మండలి చైర్మన్లు, సభ్యులు కృషి చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. టీడీపీ కార్యాలయం వద్ద శనివారం మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 12 దేవాలయాల ధర్మకర్తల మండలి చైర్మన్లు, సభ్యులతో జరిగిన ప్రత్యేక సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. మచిలీపట్నంలో పురాతన చరిత్ర కలిగిన దేవాలయాలు ఎన్నో ఉన్నాయని, వాటి ప్రాశస్త్యాన్ని భక్తులకు తెలియజేయాలన్నారు. నిరంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలు, పారాయణలు, అర్చనలు, కైంకర్యాలు జరుపుతూ ఆయా దేవాలయాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియచేయాలన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రంలోని దేవాలయాల ఔన్నత్యాన్ని చాటి చెప్పేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు దాతల సహకారం తీసుకోవాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలందరితో కలిసి కమిటీలు నిర్ణయించామన్నారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ, బీజేపీ, జనసేన ఐక్యతకు దర్పణంగా నిలిచిందన్నారు. బీజేపీ నేత, ప్రముఖ న్యాయవాది సోడిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, దేవాలయాల చరిత్రను ముద్రించి భక్తులకు అందచేసి ప్రచారం చేయాలన్నారు. డీసీఎంఎస్ చైర్మన్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ దేవాలయాల పవిత్రతను కాపాడాలన్నారు. కరగ్రహారం ట్రస్టు బోర్డు సభ్యులు తమ దేవాలయ ఆస్తులు ఆక్రమణకు గురయ్యాయని మంత్రి దృష్టికి తీసుకుని వచ్చారు. గొడుగుపేట వేంకటేశ్వర స్వామి దేవాలయం ట్రస్టు బోర్డు సభ్యులు డిసెంబరు 1న గీతాజయంతి నిర్వహిస్తున్నామని, ఆ కార్యక్రమానికి అందరినీ ఆహ్వానించారు. తెలుగు రైతు కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, బందరు మండల రూరల్ పార్టీ అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, నగరాధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, కార్యదర్శి బచ్చుల అనిల్‌కుమార్, టీడీపీ నేతలు ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, రాజు పాల్గొన్నారు.

ధరలేక, అమ్మలేక..!

సీసీఐ నిబంధనలకు పత్తి రైతు చిత్తు ● కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత లేదని తిప్పి పంపేస్తున్న అధికారులు
● దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేటు వ్యాపారులు ● పంటను విక్రయించుకోలేని దీనస్థితిలో అన్నదాతలు



సీసీఐ వారు తిప్పి పంపిన పత్తిని చూపుతున్న రైతు నలజాల ప్రమోద్

పెనుగంచిప్రోలు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అష్టకష్టాలు పడి సాగు చేసిన పత్తిని కొనుగోలు చేసే నాథుడు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రానికి పత్తిని విక్రయించేందుకు వెళ్లిన రైతుల పరిస్థితి దీనంగా మారింది. వారి నుంచి కొనుగోలు చేస్తే ఒట్టు. నాణ్యత లేదని తిప్పి పంపస్తున్నారు. మరోవైపు ప్రైవేటు వ్యాపారులు రైతులను మభ్యపెట్టి కారుచౌకగా కొనుగోలు చేస్తున్నారు. ఆరుగాలం కష్టాన్ని ప్రైవేటు వ్యాపారులకు పణంగా పెట్టలేక కొంతమంది రైతులు తమ దగ్గరే నిల్వ చేసుకునే దుస్థితి దాపురించింది. పెనుగంచిప్రోలుకు చెందిన రైతు నలజాల ప్రమోద్ తనకున్న మూడెకరాలకు మరో ఏడెకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. ఎకరాకు రూ.50 వేలు పెట్టుబడి. పత్తి తీయగా ఎకరాకు సగటున 4 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. స్థానికంగా ప్రైవేటు వ్యాపారులు క్వింటా రూ.4వేలకు అడగటంతో విక్రయించలేక ఇంట్లోనే నిల్వచేశాడు. తిరుమలగిరి సమీపంలోని పత్తి మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకుపోతే పత్తిలో నాణ్యత లేదనే సాకుతో తిప్పి పంపారు. ఇప్పటి వరకు రూ.5లక్షలు అప్పులు చేశానని రైతు తెలిపారు. పత్తి విక్రయించకపోవటంతో పత్తి తీసిన కూలీలకు డబ్బులు చెల్లించేని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పత్తి తీతల సమయంలో మోంథా తుఫాన్ విరుచుకుపడటంతో పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరాకు సగటు 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం 4 క్వింటాళ్లకు మించటం లేదు. పల్లపు భూముల్లో సాగు చేసిన పంట పూర్తిగా నాశనమై పెట్టుబడులు కోల్పోయారు. ప్రస్తుతం అరకొరగా చేతికొచ్చిన పంట కొనే నాథుడు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉర్దూ అకాడమీకి పునర్‌వైభవం తెస్తాం

● ఉర్దూ అకాడమీ చైర్మన్ మొహ్మద్ ఫరూక్ షుబ్లీ



కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ అకాడమీలో ఉద్యోగం చేసి జీతాలు తీసుకొనేవారికి ప్రాధాన్యం ఇస్తామని, పనిచేయకుండా కేవలం గౌరవ వేతనాలు, పెన్షన్ మాదిరిగా జీతాలు పొందేవారిని ఉపేక్షించబోమని ఏపీ ఉర్దూ అకాడమీ చైర్మన్ మొహ్మద్ ఫరూక్ షుబ్లీ స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన బాధ్యతాయుతమైన చైర్మన్ పదవికి పూర్తి న్యాయం చేస్తానన్నారు.ఏ విభాగంలో లేనివిధంగా 159 మంది ఉద్యోగులు ఉర్దూ అకాడమీలో ఉన్నారని, వీరిని సద్వినియోగం చేసుకొనేలా శ్రమిస్తానన్నారు. రాష్ట్రంలో ఉర్దూ రెండో అధికార భాషగా ఉన్నందున ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసే బోర్డుల్లో ఉర్దూ వినియోగం ఉండేలా చూస్తామన్నారు. నగరాల్లో తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో కనిపించే 'ఐ లవ్ ఆంధ్రప్రదేశ్' వంటి బోర్డులను ఉర్దూ పదాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. మదర్‌సా మోడరనైజేష న్ కింద ఉర్దూ భాష అభివృద్ధికి అకాడమీ కృషి చేస్తుందన్నారు. ఉర్దూలో డీటీపీ నేర్చుకొనే అవకాశాన్ని కల్పిస్తామని షుబ్లీ వివరించారు.

దివ్యాంగ మాజీ అధికారి విలవిల

● ఈఎల్, బిల్లులు, పెన్షన్ నెలలుగా పెండింగ్



కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవలో 30 ఏళ్లు గడిపిన మాజీ ప్రభుత్వ అధికారి ఇప్పుడు జీవించేందుకు యుద్ధం చేస్తున్నారు. ఏపీ ఇన్‌ఫర్మేషన్ సెంటర్ (ఏపీ భవన్, న్యూఢిల్లీ)లో స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేసి జనవరి 2025లో వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకొన్న భోగి వెంకట సత్యనారాయణ ప్రస్తుతం తీవ్రమైన దివ్యాంగ, ఆర్థిక నష్టాలతో విలవిలలాడుతున్నారు. మార్చిలో జరిగిన ప్రమాదంలో రైట్ హిప్‌కు బాల్, రాడ్ ఆపరేషన్ కావడంతో నెలలుగా మంచానికే పరిమితమైన ఆయనకు, పెన్షన్ పత్రాలు ఇంకా ఏజీ కార్యాలయంలో క్లియర్ కాలేదు. అంతేకాక జూన్ 2025 నుంచి ఆయన ఎర్నర్ లీవ్ ఎంకాష్‌మెంట్ బిల్లులు (2025-847965, 2025-851306) ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లోనే పెండింగ్‌లో ఉన్నాయని తెలిసింది. విజయవాడలో భార్యతో కలిసి నివసిస్తున్న ఆయన నెలకు చెల్లించాల్సిన రూ.33 వేల ఈఎంఐ కూడా 4 నెలలుగా చెల్లించలేక బ్యాంకుల ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. అంతేకాక 2019 నుంచి గవర్నర్ బంగ్లాలో అవుట్ సోర్సింగ్ ట్రాన్స్‌లేటర్‌గా పనిచేస్తున్న భార్య మాధవిరాణి, భర్త ప్రమాదం తర్వాత 20 రోజులు సెలవు తీసుకొని విధులకు వచ్చినా 'ప్రస్తుతం అవసరం లేదు' అంటూ తీసుకోలేదని కుటుంబం చెబుతోంది. బిల్లులు పెండింగ్, పెన్షన్ లేదు, భార్య ఉద్యోగం పోయింది, దివ్యాంగ స్థితిలో జీవించడం కష్టమైపోయింది. ఫైనాన్స్ శాఖ, గవర్నర్ కార్యాలయం మానవతా దృక్పథంతో స్పందించాలని సత్యనారాయణ విన్నవించుకొంటున్నారు.

మానవత్వం చాటిన పోలీస్ కానిస్టేబుళ్లు

● జాతీయ రహదారిపై మట్టి, రాళ్లు తొలగింపు



పారలతో మట్టి, రాళ్లు తొలగిస్తున్న కానిస్టేబుళ్లు

ఎ.కొండూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు కానిస్టేబుల్స్ విధి నిర్వహణలో శ్రామికులగా మారి మట్టి, రాళ్ల తొలగించారు. రోడ్డు సేఫ్టీ మొబైల్-5 లో కానిస్టేబుల్స్ కే జాషువా, సర్వేశ్వరావు హైవేపై విధులు నిర్వహిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని ఒక టిప్పర్ నుంచి ఎ.కొండూరు మండలంలోని దీప్లానగర్ నాగసింధు స్పినింగ్ మిల్స్ సమీపంలో జాతీయ రహదారి (30)పై మట్టి, రాళ్లు పడిపోయాయి. ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా ఉండటంతో హైవే సిబ్బందికి సమాచారం అందింది. విధి నిర్వహణలో ఉన్న జాషువా, సర్వేశ్వరరావు రాత్రిపూట చలిలో పార పట్టుకొని మట్టి, రాళ్లు తొలగించారు. ప్రమాదాల నివారణకు ఈ ఇద్దరు కానిస్టేబుళ్లు చేసిన పనికి ప్రజలు, వాహనదారులు అభినందనలు తెలిపారు.

కాపు డిక్లరేషన్ ప్రకటిస్తాం: ఆకుల

● కాపునాడు స్వర్ణోత్సవ బహిరంగ సభ నేడు

గాంధీనగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాపునాడు స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని పలువురు కాపు నేతలు పిలుపునిచ్చారు. స్థానిక జింఖానగ్రౌండ్‌లో జరిగే ఈ బ్రోచర్‌ను గాంధీనగర్‌లోని సంఘం కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సభలో విజయవాడ కాపు డిక్లరేషన్ ప్రకటిస్తామన్నారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్లు వెన్నకోట శ్రీనివాస్, రమేష్, నేతలు ఆకుల తిరుపతిరావు, పరుచూరి కరుణాకర్, నరహరిశెట్టి జ్యోతి, వేల్పుల శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంరి జర్వేషన్లు రద్దు చేయడం, కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకుండా కాపులకు తీరని ద్రోహం చేసిందన్నారు. ఆకుల తిరుపతిరావు, నరహరిశెట్టి జ్యోతి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 640

అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వండి: ఎంపీపీ పుష్పరాణి

గుడివాడ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు అత్యంత ప్రాముఖ్యతనివ్వాలని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. శనివారం మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్, తాగునీరు, విద్య, వైద్యం విషయాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సక్రమంగా తాగునీరు అందించటానికి కృషి చేయాలని తెలిపారు. సాగునీరు సరఫరాలో తగు చర్యలు తీసుకోవాలన్నారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో విష్ణుప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్బన్‌బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జ్‌గా కృష్ణకాంత్

గుడివాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ది గుడివాడ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా వి.కృష్ణకాంత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత కృష్ణకాంత్‌కు బ్యాంకు సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడ అర్బన్ బ్యాంకు ఖాతాదారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సేవా చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. బ్యాంకు సీఈవో టి.ఎస్.ఎస్.ఆర్.చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్‌లకు ఏడాది గౌరవవేతనం

గుడివాడ, నవంబరు29(ఆంధ్రజ్యోతి) : గుడివాడలో మైనార్టీల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తున్నామని, ఇమామ్, మౌజన్‌లకు ఏడాది గౌరవ వేతనం విడుదల చేయడం హర్షణీయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం ప్రజావేదికలో ధ్యాంక్యూ సీఎం సార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులున్నా ప్రజలకు యిచ్చిన హామీలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, మైనార్టీ నాయకులు షేక్‌మౌలాలి, సయ్యద్ జబీన్, రఫీ, సర్దార్‌బేగ్, కరీముల్లా, అబ్దుల్ సత్తార్, షేక్ జానీ, నూర్ పాల్గొన్నారు.

సైక్లోథాన్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తాం

గుడివాడ, నవంబరు29(ఆంధ్రజ్యోతి): ఐఎంఏ సభ్యులు, గుడివాడ సైక్లింగ్ క్లబ్ సభ్యులు, ఎన్‌టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో ఆదివారం సైక్లోథాన్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్టు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్టేడియం కార్యాలయంలో పోలీసు అధికారులు, ఆర్‌టీసీ, ఐఎంఏ సభ్యులు సమీక్షా సమావేశం నిర్వహించారు.

అసంఘటిత కార్మికులకు జీవనజ్యోతి అండ

గుడివాడ, నవంబరు29(ఆంధ్రజ్యోతి) : అసంఘటిత కార్మికులకు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతిపథకం కొండంత అండగా నిలుస్తుందని పండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు గోకరకొండ బలరాం అన్నారు. రైతుబజారు వద్ద సంఘ కార్యాలయంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన పండ్ల వర్తక సంఘం సభ్యులు గుంట్రెడ్డి తిరుమలరావు కుటుంబసభ్యులకు శనివారం చెక్కును గోకరకొండ, పోస్టల్ అధికారులు అందజేశారు. కార్యక్రమంలో తపాల శాఖ సీనియర్ మేనేజర్ పులిపాటి గణేష్, నైనాల చిన్న, పెద్ది రమణ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థాన అన్నదానానికి విరాళం

గుడివాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాటిమీద వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రతి శనివారం నిర్వహించే శాశ్వత అన్నదాన కార్యక్రమానికి శనివారం లక్ష్మీ కంప్యూటర్స్ అధినేత పొట్లూరి గోపాలరావు, కుటుంబసభ్యులు రూ.10,116/-లు చెక్కును ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావుకు అందజేశారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న వైద్యసిబ్బంది

లైంగిక దాడుల నివారణపై అవగాహన

గుడివాడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : ఏరియా ప్రభుత్వాసుపత్రిలో జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్, ఆర్‌బీఎస్‌కే అధికారిణి డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో చిన్నారులపై లైంగిక దాడులు-నివారణ అంశంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎర్లీ ఇంటర్వెంషన్ చైల్డ్ సైకాలజిస్టు రత్నకుమారి మాట్లాడుతూ చిన్నారులపై ఏ విధంగా లైంగిక దాడులు జరుగుతున్నాయో, వాటిని అరికట్టేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పి.పియూనిట్ వైద్యులు శ్వేత, సురేష్, అనంత్, జోషికుమారి, సైకాలజిస్ట్ సుబ్రహ్మణ్యం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమలకు
ఉద్యం రిజిస్ట్రేషన్ తప్పనిసరి

తోట్లవల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పాదలచినవారు ఉద్యం పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక అధికారి వై.నాగేంద్ర భూపాల్ కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఔత్సాహికులు ఉద్యం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచిం చారు. సూక్ష్మ, చిన్న పరిశ్రమల వృద్ధికి కేంద్రప్రభుత్వం రాంప్ ప్రోగ్రాం ద్వారా వివిధ ప్రోత్సాహకాలను అందిస్తోందని నాగేంద్ర భూపాల్ వివరించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఎం.సాంబశివరావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆటల పోటీలు ప్రారంభం


వెంట్రప్రగడ జడ్పీ హైస్కూల్‌లో..

పమిడిముక్కల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి ఉపాధ్యాయుల ఆటల పోటీలను డీవైఈవో శనివారం ప్రారంభించారు. తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పురుషులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ సెలక్షన్లు నిర్వహించారు. ఎంఈవో శ్రీనివాసరావు, హెచ్‌ఎం వై.ఎస్.ఎన్.ప్రసాద్, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంపికైనవారు ఉయ్యూరు డివిజన్ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పీఈటీ పి.రవీంద్రబాబు తెలిపారు.

పెదపారుపూడి: మండల స్థాయి ఎంపికలు శనివారం వెంట్రప్రగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగాయి. పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయినులకు త్రోబాల్ ఎంపికలు జరిగాయి. ఎంఈవో బి.శ్రీనివాస్, వి.సురేష్, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో పెదపారుపూడి మండల వ్యాయామోపాధ్యాయుల పర్యవేక్షణలో ఎంపిక చేశారు. ఎంపికయిన ఉపాధ్యాయులు 13, 14 తేదీల్లో గుడివాడలో జరిగే డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం కె.హరికిషోర్ తెలిపారు.

కూచిపూడి: మొవ్వ మండల ఉపాధ్యాయ క్రీడా పోటీలు శనివారం జడ్పీ పాఠశాల ఆవరణలో ప్రారంభమయ్యాయి. ఎంఈవో-1 భాను ప్రకాష్, ఎంఈవో-2 కె.శ్రీలక్ష్మి, జడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఉమశ్రీ పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : ఎంఈవో -2బాలాజీ మాట్లాడుతూ గుడివాడ మండలంలోని ఉపాధ్యాయులందరూ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి వెళ్లాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నలుగురు రౌడీషీటర్‌ల బైండోవర్

గుడివాడ, నవంబరు29(ఆంధ్రజ్యోతి) : సత్ప్రవర్తన నిమిత్తం నలుగురు రౌడీషీటర్లను శనివారం తహశీల్దార్ కిరణ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఒన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ శంకర్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు - ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలు

బాపులపాడు మండలం తిప్పనగుంటకు చెందిన మురాల ప్రవీణ్‌కుమార్ బైక్‌పై శనివారం నాగవరప్పాడు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో ప్రవీణ్ కుమార్ గాయపడ్డాడు. బాధితుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దిత్వాతో.. ధాన్యం రైతుల్లో కలవరం

సంచుల కొరత, వాహనాలు కొరత



రొయ్యూరు వద్ద కరకట్టపై శనివారం ధాన్యం రాశులు.. గుడ్లవల్లేరు మండలంలో ధాన్యం రాశులపై పరదాలు కప్పుతున్న రైతులు

తోట్లవల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సాయంత్రం దిత్వా తుఫాను ప్రభావంతో వాతావరణంలో మార్పులతో చినుకులు పడ్డాయి. దీంతో ధాన్యం రైతుల్లో కలవరం మొదలయింది. రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, పెనమకూరు, భద్రిరాజుపాలెం తదితర గ్రామాల్లో యంత్రాలతో కోసిన ధాన్యం రోడ్లపై ఆరబెట్టారు. చినుకులు పడటంతో ఆందోళనతో రైతులు పరదాలు కప్పేందుకు ఉరుకులు పరుగులు పెట్టారు. రొయ్యూరులో గోనె సంచులు కొరతగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. సంచులు ఇద్దరు ముగ్గురు రైతులకు ఇస్తే మిగతా రైతులకు లేవని చెపుతున్నారని రైతు యార్లగడ్డ పరమేశ్వరరావు అన్నారు. 26 నుంచి కరకట్టపై 13 ఎకరాల ధాన్యం ఆరబెట్టి ఉంచానని, సంచులు లభిస్తే శనివారం కాటా వేసే వారమన్నారు. తోట్లవల్లూరు అమ్మగారి చెరువు డొంకలో 17 శాతానికి ఆరిన ధాన్యాన్ని కాటా వేసేందుకు సిద్ధంకాగా ముఠా కూలీలు రాలేదు. ఇంతలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవటంతో ఆందోళనగా ఉందని రైతు సీతారామయ్య అన్నారు. కొన్నిచోట్ల కాటా వేసిన ధాన్యం మిల్లులకు చేరవేసేందుకు వాహనాలు రాక రోడ్లపైనే ఉన్నాయి.


అయ్యంకిలో రోడ్డుకు ఓ వైపు ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు, మరోపక్క కాటాలు వేసిన బస్తాలు

ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలి : ఏవో

తుఫాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని, ధాన్యాన్ని రైతులు కమ్యూనిటీ భవనాలు, సొంత భవనాల్లోకి చేరవేసి రక్షించుకోవాలని ఏవో జి.శ్రీదేవి రైతులకు సూచించారు. మండలంలో 9వేల ఎకరాల్లో వరి సాగవగా ఇప్పటికి 2,500 ఎకరాల్లో కోతలు కోశారు. పచ్చి ధాన్యం మాత్రమే ఎక్కువగా రోడ్లపై ఉందన్నారు. ఇతర ప్రాంతాల్లో మిల్లర్లను తహసీల్దార్ సంప్రదిస్తున్నామన్నారు. ఒకేసారి ధాన్యం కోతలు జరగటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని శ్రీదేవి తెలిపారు.

రోడ్లపైనే ధాన్యం రాశులు

గుడ్లవల్లేరు : దిత్వా తుఫాను ప్రభావంతో శనివారం సాయంత్రం నుంచి వాతావరణంలో మార్పు కన్పించింది. దాంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మండలంలో పదివేల ఎకరాలకు పైగా వరికోత కోసి ధాన్యం రాసులు రోడ్లపై ఉంది. కొనుగోళ్ల కాక, తోలకానికి లారీలు, ట్రాక్టర్లు అందుబాటులో లేని కారణంగా ధాన్యం బస్తాలు కూడా రోడ్లపైనే ఉండటంతో రైతులు వాటిపై టార్పాలిన్‌లు కప్పుతూ కన్పించారు.

ఎక్కడ చూసినా ధాన్యం రాశులే..

కూచిపూడి: సంచుల కొరత, లారీల కొరత కారణంగా మండలంలో ఏ గ్రామం చూసినా రోడ్ల వెంబడి కాటాలు వేయాల్సిన ధాన్యం రాశులు, కాటాలు వేసిన ధాన్యపు బస్తాలే దర్శనమిస్తున్నాయి. సంచుల కొరత, తేమ శాతం కారణంగా ధాన్యాన్ని ఆరబెట్టుకోవటం, సాయంత్రానికి గుట్టలుగా పోగు చేసి పరదాలు కప్పుకోవటం రైతులకు పరిపాటిగా మారింది. లారీల కొరత కారణంగా చినముత్తేవి, ఆవిరిపూడి, కూచిపూడి, మొవ్వ, కారకంపాడు, పెదపూడి తదితర గ్రామాల్లో ఈ పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. మరో పక్క తుఫాను హెచ్చరికల నేపథ్యంలో చేతికందివచ్చిన పంటను కోల్పోవాల్సి వస్తోందని హడావిడిగా రైతులు యంత్రాలతో వరి నూర్పిళ్లు ముమ్మరం చేయటంతో ధాన్యపు రాశులు పేరుకుపోయాయి.

రైతన్న ఎదగడానికి ప్రభుత్వ కృషి

రైతన్నా.. మీ కోసంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆర్థికంగా, సామాజికంగా సమాజంలో ఉన్నత స్థానానికి ఎదగటానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. రైతన్న మీ కోసం దొండపాడు గ్రామంలో శనివారం నిర్వహించారు. రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు అంశాల కరపత్రాలు అందించి వివరించారు. స్వచ్ఛమైన పంటలు వేసుకోవటం, ఆర్థికంగా ఏ విధంగా ఎదగాలో తదితర అంశాలను వివరించారు. ప్రతీ రైతు వరితోపాటు అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పండించిన ధాన్యాన్ని వెంటనే ఆర్‌ఎస్‌కేల ద్వారా మిల్లులకు తోలటానికి కృషి చేస్తామన్నారు. తుఫాను హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతులకు అన్ని విధాలుగా చేయూతనందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇంచార్జి బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, ఏడీఏ సూరపనేని కవిత, డీసీ చైర్మన్లు నూతక్కి కుటుంబరావు, లింగమనేని వీరబసవయ్య, దొండపాడు పీఏసీఎస్ చైర్మన్ ముసునూరి రాజేంద్ర ప్రసాద్, ఏవో బోలెం అనంతలక్ష్మి, ఎంపీడీవో విష్ణుప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు వాసే మురళీ పాల్గొన్నారు.


దొండపాడులో రైతన్న.. మీకోసం బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్ : తుఫాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు ఇబ్బంది పడకుండా ముందు జాగ్రత్త చర్యగా ధాన్యాన్ని మిల్లలకు తరలించటానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. రామన్నపూడిలో రైతన్న మీ కోసం శనివారం జరిగింది. రైతులు ధాన్యం రాశులు మిషన్లతో కోసి ఉంచారని, తమ ధాన్యం వెళ్లే విధంగా చూడాలని కోరగా, కలెక్టర్, జేసీ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రతీ రైతు మిల్లులకు పర్మిషన్లు త్వరగా ఇచ్చి రైతుల నుంచి ధాన్యం కొనే విధంగా కృషి చేయాలని కోరారు. స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తుఫాన్ వెళ్లే వరకు అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదించి ధాన్యం మొత్తం వెళ్లటానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి : రూ.3.57లక్షలు స్వాధీనం

గుడివాడ, నవంబరు29(ఆంధ్రజ్యోతి) : నందివాడ మండలం చలసాని కోటేశ్వరరావు చెరువు గట్టుపై నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గుడివాడ రూరల్ సీఐ ఎస్.ఎల్.ఆర్ సోమేశ్వరరావు, నందివాడ ఎస్సై కుడిపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం దాడిచేశారు. దాడిలో 17మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,57,380, 20 సెల్‌ఫోన్‌లు, ఒక కారు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ సోమేశ్వరరావు తెలిపారు.

వలివర్తిపాడులో ఇళ్లు దగ్ధం

గుడివాడ రూరల్ : వలివర్తిపాడు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇళ్లు పూర్తిగా కాలిపోయింది. గృహంలోని గృహోపకరణాలు కాలిపోవటంతో రూ.3 లక్షల నష్టం వాటిల్లింది. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

పేదరిక నిర్మూలన కోసమే పీ-4

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్యే వర్ల



సమావేశంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లనారాయణతో కలసి మాట్లాడుతున్న వర్ల కుమార్‌రాజా

పామర్రు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం సీఎం చంద్రబాబు తీసుకున్న ఆదర్శనీయ ఆలోచన పీ-4 అని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. పామర్రు ఒకటో గ్రామ సచివాలయం భవనంలో శనివారం పీ-4 కార్యాలయాన్ని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలసి ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనకళ్ల మాట్లాడుతూ, నాయకుడు అంటే గౌరవంతో వెనుక ఉండి పనిచేస్తేనే ఏదైనా సాధ్యమని కూటమినేతలు గ్రహించి ముందుకు నడవాలన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ, సమాజంలో పేదప్రజల ఆర్థిక స్థితిగతులను మార్చేడమే లక్ష్యంగా చంద్రబాబు ప్రత్యేక దృష్టితో ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి, సర్పంచ్ కె.కస్తూరి, ఏఎంసీ చైర్మన్ జన్ను శోభన్‌బాబు, లింగమనేని రామలిం గేశ్వరరావు, తాడిశెట్టి నరేష్, కొండా ప్రవీణ్, వల్లూరిపల్లి గణేష్, కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, మండపాక శంకర్‌బాబు, కోటిపాండు, పి. సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సీఎంసహాయనిధి చెక్కు అందజేత

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. శనివారం పీ-4కార్యాలయంలో రాపర్ల గ్రామానికి చెందిన కాకర్ల వెంకటేశ్వరమ్మకు రూ.92,926 చెక్కును శనివారం ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలసి అందజేశారు. అనంతరం నిర్వహించిన రైతన్న మీకోసంలో ఎమ్మెల్యే కుమార్‌రాజా, కొనకళ్ల నారాయణరావు పాల్గొన్నారు. అన్నదాతలకోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు

గుడివాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పిల్లలు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని ప్రిన్సిపల్ సివిల్ న్యాయమూర్తి పి.గాయత్రి అన్నారు. మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో శనివారం బాలోత్సవం ప్రారంభమైంది. తొలుత న్యాయమూర్తి గాయత్రి జాతీయ జెండాను ఆవిష్కరించారు. మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు సనకా సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో న్యాయమూర్తి గాయత్రి మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం దేశభక్తి గీతాలు, వ్యాసరచన, కార్టున్లు, వకృత్వం, లఘు నాటిక విభాగాల్లో పోటీలను నిర్వహించారు. గౌరవాధ్యక్షుడు కోగంటి ఆంజనేయులు, విశ్రాంత జిల్లా జడ్జి అన్నవరపు కోటేశ్వరరావు, విశ్రాంత డైట్ ప్రిన్సిపాల్ మన్యం వీరగంగ ఆంజనేయులు, ఎంఈవో సి.హెచ్.రజినీకుమారి తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.6.01లక్షలు

పామర్రు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద గల వీరాంజనేయస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు శనివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. 94 రోజులకుగాను రూ.6.01 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ చైర్మన్ తాడిశెట్టి వెంకటేశ్వరరావు, పర్యవేక్షణాధికారివి సుధాకర్ తెలిపారు. లెక్కింపులో ఆలయ పాలక మండలి సభ్యులతోపాటుగా ఆలయాధికారి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 640



భగవద్గీత పోటీలు ప్రారంభం

మచిలీపట్నం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో బచ్చుపేట వేంకటేశ్వరస్వామి దేవాలయంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న భగవద్గీత పోటీలను శనివారం దేవాలయం స్థానాచార్యుడు ముత్తేవి శశికాంత్ ప్రారంభించారు. మొదటి రోజు పెద్దలకు పోటీలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 6, 7, 8, 9 విద్యార్థులకు గుణత్రయ విభాగంలోనూ, 10, ఇంటర్ విద్యార్థులకు దైవాసుర సంపద్ విభాగ యోగంలోనూ పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు మధ్యాహ్నం కొల్లు ఫౌండేషన్ అధ్యక్షురాలు, మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ బహుమతులు అందజేస్తారని శ్రీవారి సేవకుడు తురగా ప్రసాద్ తెలిపారు.

ప్రజా దర్బార్‌లో వినతుల స్వీకరణ



ప్రజా దర్బార్ నిర్వహించాక సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి కొల్లు రవీంద్ర అర్జీలు స్వీకరించారు. ఇళ్ల స్థలాలు, ఇళ్లు, పింఛన్ల కోసం పలువురు వినతిపత్రాలు అందజేశారు. తనకు పర్ణశాలలో ఉన్న రెండు సెంట్ల ఇళ్ల స్థలాన్ని పక్కింటి వారు ఆక్రమించుకుంటున్నారని కె.ఝాన్సీకుమారి మంత్రికి మొరపెట్టుకున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. తమ డివిజన్ పరిధిలోని సమస్యలను మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు, మచిలీపట్నం అర్బన్ బ్యాంకు అధ్యక్షుడు ఐ. దిలీప్‌లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. బచ్చుల బోసుబాబు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 26 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరయిన రూ.16 లక్షల 62వేల చెక్కులను శనివారం టీడీపీ కార్యాలయంలో మంత్రి కొల్లు రవీంద్ర అందజేశారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురికి పార్టీ సంక్షేమ నిధి నుంచి రూ.5 లక్షల చొప్పున రూ. 15 లక్షల బీమా నగదు అందజేశారు. ఇప్పటికి మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో 455 మందికి రూ. 5 కోట్ల ముఖ్యమంత్రి సహాయనిధి అందించామన్నారు.

గౌరా పవన్ అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి

మచిలీపట్నం టౌన్: ఈడేపల్లిలో మృతిచెందిన న్యాయవాది గౌరా పవన్ అంత్యక్రియల్లో శనివారం మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. పవన్ తండ్రి మల్లయ్య స్వీట్స్ అధినేత గౌరా వెంకటేశ్వరరావును మంత్రి పరామర్శించారు.



ప్రజా దర్బార్‌లో వినతిపత్రాలు స్వీకరిస్తున్న టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు

ప్రజా దర్బార్‌లో సమస్యలకు సత్వర పరిష్కారం

● టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు

అవనిగడ్డ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్ కార్యక్రమం ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి వేదికగా నిలుస్తోందని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. శనివారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్జీలు స్వీకరించటమే కాకుండా ఆ సమస్యలు వారం, 15 రోజుల్లోపు పరిష్కారమయ్యేలా చూస్తామని కనపర్తి శ్రీనివాసరావు, బొబ్బా గోవర్ధన్ తెలిపారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే శ్రీనివాసరావు, పరుచూరి దుర్గాప్రసాద్, బండే రాఘవ, మండలి రామ్మోహనరావు, బండే కనకదుర్గ, విశ్వనాథపల్లి పాప, ఘంటసాల రామ్మోహనరావు, పరిశె మౌళి, అడపా శ్రీను, కంచర్ల ఆనంద్, మేడికొండ విజయ్, అన్నపరెడ్డి వెంకటేశ్వరమ్మ, దిల్షాద్ నజరానా, కొల్లూరి వాసు, కొల్లూరి ఇమ్మానియేలు తదితరులు పాల్గొన్నారు.

22 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ కటకం నాగకుమారి

పెడన, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. అజెండాలోని 22 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. పైడమ్మ జాతర ఉత్సవాల్లో ఉత్సవ ప్రాంగణంతో పాటు గూడూరు రోడ్డుకు ఇరువైపులా అంగళ్ల ఏర్పాటు చేసుకునే వారి నుంచి రుసుము వసూలు చేసుకునే హక్కుకు నిర్వహించిన వేలంలో అందరి కంటే ఎక్కువగా రూ. 12 లక్షల 13వేలకు పాడిన ఎలిగట్ల ప్రసాద్ పాటను సమావేశం ఆమోదించింది. ప్రజారోగ్య విభాగంలో ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తూ మరణించిన గొడవర్తి శేషగిరిరావు భార్య హైమావతికి, యల్లంకోట సత్యనారాయణ భార్య రుక్మిణికి డెత్ ఎక్స్‌గ్రేషియో కింద ఒక్కొక్కరికి రూ.2 లక్షలు జనరల్ ఫండ్స్ నుంచి చెల్లించాలని కౌన్సిల్ తీర్మానించింది. పైడమ్మ జాతర ఉత్సవాలలో మునిసిపాలిటీపరంగా చేయాల్సిన ఏర్పాట్లకు నిధులు కేటాయించారు. 15 వ ఆర్థిక సంఘం నిధులతో 2, 14, 21, 7, 22 వార్డులలో సీసీ రోడ్ల నిర్మాణానికి దాఖలైన టెండర్లను కౌన్సిల్ ఆమోదించింది. రూ. లక్ష వెచ్చించి పైడమ్మ లే అవుట్ లో మంచినీటి పైపులైను వేయాలని సమావేశం నిర్ణయించింది. వైస్‌చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, ఫ్లోర్ లీడర్ బళ్ల గంగయ్య, ఇన్‌చార్జి కమిషనర్ కాగిత సీతారామాంజనేయులు, మేనేజర్ మట్టా రాజా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ పాల్గొన్నా రు.

శాలివాహన కుమ్మరుల సమస్యలు పరిష్కరించాలి

మచిలీపట్నం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శాలివాహన కుమ్మరుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని శాలివాహన కుమ్మరుల సంక్షేమ సంఘ జిల్లా నూతన అధ్యక్షుడు పద్మ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇంగ్లీషుపాలెం షాదీఖానాలో శనివారం రాత్రి సంఘం జిల్లా కమిటీ ఎన్నికలు జరిగాయి. పద్మ నాగేశ్వరరావు నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. పెడన నగర కమిటీకి ఎం. రాంబాబు, గన్నవరం కమిటీకి వై. వెంకటకోటేశ్వరరావు, కోమాళ్ల శ్రీనుబాబు, చిన్నాపురం కమిటీకి మేదురుమిల్లి రామకృష్ణ ఎన్నికయ్యారు. ఈశ్వరరావు, బసవేశ్వరరావు, మల్లేశ్వరరావు, వీరయ్యపాల్గొన్నారు.

5న రైతుబజార్ సైకిల్ స్టాండ్ వేలం

మచిలీపట్నం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతుబజార్‌లోని సైకిల్ స్టాండ్, క్యాంటీన్ల నిర్వహణకు బహిరంగ వేలం పాట డిసెంబరు 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తామని ఎస్టేట్ ఆఫీసర్ బలిచక్రవర్తి తెలిపారు. జిల్లా మార్కెటింగ్ అధికారి కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● రైతుల వద్ద ధాన్యం ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలి: ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



కొడాలి మార్కెట్ యార్డు వద్ద ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ఘంటసాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. కొడాలి మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఆరబెట్టి ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి మిల్లులకు తరలించేలా అధికారులు చూడాలన్నారు. వర్షం కురిస్తే గ్రామాల్లో ఉన్న గిడ్డంగులు, కమ్యూనిటీ భవనాలు, కల్యాణ మండపాల్లో ధాన్యాన్ని భద్రపర్చుకునేలా వారికి సహకరించాలని సూచించారు. ఘంటసాల మండలంలో ఇప్పటి వరకు 1102 మంది రైతుల వద్ద నుంచి 5932 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, రూ.కోటి 40 లక్షల నగదును రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కనకదుర్గ, టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, జనసేన మండల అధ్యక్షుడు కోన రాజశేఖర్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, పీఏసీఎస్ చైర్మన్ బండి పరాత్పరరావు, గొర్రెపాటి సురేష్, ఎంపీడీవో సుబ్బారావు, డీటీ కనకదుర్గ, ఏడీఏ శ్యామల, ఏవో డి.అనూష పాల్గొన్నారు.

గోనె సంచులు, వాహనాలు సిద్ధంగా ఉంచాలి

మోపిదేవి: ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక శ్రద్ధ, నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ రైతులకు మేలు జరిగేలా చూడాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశించారు. శనివారం మోపిదేవి తహసీల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఏయే గ్రామాల్లో ఎంత ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉంది.. ఎన్ని గోనె సంచులు.. ఎన్ని వాహనాలు కావాలి అనే అంశాలపై స్పష్టత కలిగి ఉండాలని సూచించారు. మండలంలో ఇప్పటి వరకు 2920 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగినట్లు తహసీల్దార్ ఎం.హరనాథ్ వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, ఎంపీడీవో జె.స్వర్ణభారతి, ఏవో హెప్సిబా రాణి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై సమీక్ష



చల్లపల్లిలో అధికారులతో సమీక్ష చేస్తున్న ప్రత్యేక అధికారి పి.సాయిబాబు

చల్లపల్లి: మండలంలో ధాన్యం కొనుగోలు తీరుతెన్నులపై నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి.సాయిబాబు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణదారులు, సొసైటీల సీఈవోలు, రైస్‌మిల్లర్లు, వీఏఏలతో సమావేశమై క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా, మిల్లర్ల నుంచి సహకారం అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గోనెసంచులు, వాహనాలను అందుబాటులో ఉంచి రైతులకు పంపాలని మిల్లర్లకు తెలిపారు. తహసీల్దార్ డి.వనజాక్షి, ఎంపీడీవో ఆనందకుమారి, ఏవో కె.మురళీకృష్ణ పాల్గొన్నారు.

యార్డుకు ధాన్యం తరలింపు

నాగాయలంక: దిత్వా తుఫాన్ ప్రభావంతో మబ్బులు పడుతుండటంతో తుంగలవారిపాలెం వంతెన దగ్గర రైతులు ధాన్యాన్ని గోనె సంచులలో నింపుకొన్నాక మిల్లర్లు వద్దనటంతో రైతులు ఆందోళన చెందారు. ఆ సమయంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు తుంగలవారిపాలెం వంతెన వద్దకు వచ్చి ధాన్యాన్ని నాగాయలంక మార్కెట్ యార్డులో పెట్టుకోమని వారికి సూచించారు దీంతో ట్రాక్టర్లతో 500 బస్తాలను హుటాహుటిన మార్కెట్ యార్డులోకి తరలించారు. తహసీల్దార్ వీరాంజనేయప్రసాద్, రైతులు పాల్గొన్నారు.



యార్డుకు ధాన్యం తరలిస్తున్న ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు

ధాన్యం కొనుగోలు నిబంధనలు సడలించాలి

● రైతు సంఘం నాయకుల డిమాండ్



ధాన్యం రాశులను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

బంటుమిల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు నిబంధనలను సడలించి, తేమ శాతం ఎక్కువగా ఉన్నా, రంగు మారినా కొనుగో లు చేసి రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పెందుర్రు, జయపురం, ఆముదాలపల్లి, ముల్లపర్రు గ్రామాల్లో నాయకులు పర్యటించారు. రోడ్లపైన ఆరబెట్టిన, సంచుల్లోకి ఎత్తిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, అజయ్‌ఘోష్, వెంట్రపాటి శ్యామ్‌సుందర్, చిటికినేని నాగమల్లి, కె.ప్రసాద్, గొట్టిపాటి గంగాధర్, కిరణ్ పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు

చల్లపల్లి: తుఫాన్ భయంతో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, ఈ క్రాప్ బుకింగ్ అయిన బీపీటీ -5204, ఎంటీయూ-1224, ఎంటీయూ-1262, ఎంటీయూ-1318 రకాలను ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా తప్పని సరిగా కొనుగోలు చేస్తామని ఏవో కె.మురళీకృష్ణ తెలిపారు. ధాన్యం తరలించటానికి కావాల్సిన గోనెసంచులు, 135కి పైగా వాహనాలు, అత్యవసర పరిస్థితుల్లో పంటను కప్పి రక్షించుకోవటానికి టార్పాలిన్ పట్టాలు సిద్ధంగా ఉంచామన్నారు. ధాన్యం సేకరణలో సమస్యలు ఉంటే వెంటనే ఏవోను లేదా తహసీల్దార్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

గుమ్మడి శ్రీనివాసరావుకు పరామర్శ



సీతామహాలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెట్టి కుసుమకుమార్ తదితరులు

ఘంటసాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొడాలి గ్రామానికి చెందిన బిల్డర్, కమ్మ గ్లోబల్ ఫౌండేషన్ సభ్యుడు గుమ్మడి శ్రీనివాసరావు తల్లి సీతామహాలక్ష్మి ఈనెల 23వ తేదీన మృతి చెందారు. కమ్మ గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్, ఏఐసీసీ సెక్రటరీ, ఒరిస్సా, జమ్మూకశ్మీర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జెట్టి కుసుమకుమార్ శనివారం కొడాలి విచ్చేసి గుమ్మడి శ్రీనివాసరావును పరామర్శించారు. సీతామహాలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. తన స్నేహితుడు శ్రీనివాసరావు తల్లి మరణం బాధాకరమన్నారు. కేజీఎఫ్ వైస్ ప్రెసిడెంట్ దోనేపూడి చక్రపాణి, సభ్యులు జంగా వెంకట శ్రీనివాసరావు, బత్తిన శ్రీనివాసరావు, మంచికలపూడి భానుప్రకాష్, ఘంటసాల మండలానికి చెందిన వివిధ పార్టీల నేతలు తుమ్మల చౌదరిబాబు, తుమ్మల మురళీకృష్ణ, తాతినేని వెంకటకృష్ణారావు, దిరిశం వెంకట్రావు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థిని పల్లవికి సన్మానం



మాక్ అసెంబ్లీలో పాల్గొన్న పల్లవిని సన్మానిస్తున్న సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈవో మాధవేంద్రరావు

చల్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో నిర్వహించిన మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో నియోజకవర్గం నుంచి పాల్గొన్న చల్లపల్లి గురుకుల పాఠశాల విద్యార్థిని డి.పల్లవిని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈవో పివి.మాధవేంద్రరావులు విద్యార్థినిని సత్కరించి పుస్తకాలు, స్టేషనరీ బహూకరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రసాద్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

చల్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రామానగరం చెరువు ఎదురుగా కుమ్మరుల బజారులో శనివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైంది. యర్రారపు వీరాంజనేయులుకు చెందిన సిమెంటు గోడలపై ఉన్న తాటాకుల ఇంట్లో ప్రమాదం జరిగి, పైకప్పు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు మంటలను అదుపుచేసే ప్రయత్నం చేసినప్పటికీ వస్తువులు, బీరువాలో సామాన్లు, నగదు, బంగారం అగ్నికి ఆహుతైంది. అవనిగడ్డ అగ్నిమాపక అధికారి సిబ్బందితో కలిసి సంఘటనా ప్రదేశానికి చేరుకుని మంటలు వ్యాపించకుండా పూర్తిగా ఆర్పివేశారు. ప్రమాదనష్టం రూ.3లక్షలు పైగా ఉంటుందని అంచనా. ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా భావిస్తున్నారు.

గురువిందగుంట్లో స్వామిత్వ సర్వే

పెడన రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆస్తులకు కచ్చితమైన పత్రాలు స్వామిత్వ సర్వేతోనే సాధ్యమని డీఎల్డీవో పద్మావతి అన్నారు. గురువిందగుంట గ్రామంలో స్వామిత్వ సర్వే అనంతరం ఆమె గ్రామసభ నిర్వహించారు. 162 నివాస గృహాలకు సర్వే చేసి నోటీసులు అందించామని ఎండీవో అరుణకుమారి తెలిపారు. సర్వే వివరాలను సభలో వివరించారు. డిప్యూటీ ఎండీవో ఎం.నాగిరెడ్డి, సర్పంచ్ పుప్పాల స్వరూపరాణి, సెక్రటరీ రాజేష్ పాల్గొన్నారు.

అయ్యప్పక్షేత్రం అభివృద్ధికి రూ.25వేలు విరాళం

చల్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిమ్మలతోటలోని హరిహరపుత్ర అయ్యప్పస్వామి క్షేత్రం అభివృద్ధికి దాతలు రూ.25వేలు విరాళం అందజేశారు. ఆలయంలో వెండి కొనుగోలు నిమిత్తం కొల్లిపర ఆంజనేయులు-రామరత్నం దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు విరాళాన్ని ఆలయ ధర్మకర్త అన్నవరపు పాండురంగారావుకు అందజేశారు.

చిన్నారుల కంటి పరీక్షా శిబిరం

చల్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంధత్వ నివారణ సంకల్ప యజ్ఞంలో భాగంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విజయా అకాడమీలో విద్యార్థులకు శనివారం ఉచిత నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించారు. 650 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి 50మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ విజన్‌కేర్ డిస్ట్రిక్ట్ చైర్మన్ యర్రంశెట్టి శ్రీనివాస్, చల్లపల్లి లయన్స్‌క్లబ్ కార్యదర్శి వరదా హరిగోపాల్, కోశాధికారి నర్రా సాయిబాబు, దుబ్బుల సాంబశివరావు, శంకరరావు, కస్తూరి ప్రసాద్, రాయపాటి రాధాకృష్ణ, ఎం.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

నాగాయలంక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భావదేవరపల్లిలో ప్రమాదవశాత్తు గురువారం రాత్రి కొవ్వొత్తితో నిప్పంటుకుని ఎస్టీ కుటుంబం ఈగ పాండురంగారావు, నాంచారమ్మ ఇంట్లోని దుస్తులు, సామాన్లు కాలిపోయి నిరాశ్రయులయ్యారు. శనివారం వారి కుటుంబానికి ఇండియన్ రెడ్‌క్రాస్ మండల చైర్మన్ శివవిష్ణు వర్ధన్, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ సహాయ సహకారాలతో దుస్తులు, దుప్పట్లు, 50 కేజీల బియ్యం, కూరగాయలు, టార్పాలిన్ పట్టా, వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. యానాది మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జనసేన పార్టీ ఎస్టీ నేత నక్కా విజయబాబు, తహసీల్దార్ వీరాంజనేయప్రసాద్, వీఆర్వో మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



భజన చేస్తున్న అయ్యప్ప దీక్షాపరులు

పెడన, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పూజా కార్యక్రమంలో భాగంగా కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి ఉపాలయంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ(చిన్నా) పర్యవేక్షణలో కొల్లిపర వంశీయులు శనివారం స్వామికి ప్రత్యేక పూజలు, 26 రకాల ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అయ్యప్పలు భజనలు చేశారు. స్వాములకు చద్ది ఏర్పాటు చేశారు. కొల్లిపర శ్రీనివాసరావు, కొల్లిపర నాగేశ్వరరావు, కొల్లిపర పూర్ణప్రదీప్, కొల్లూరి రాధాకృష్ణ, ఆత్మకూరి సురేష్ పాల్గొన్నారు.